E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 19-06-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



రైతుల చేతులకు సంకెళ్లు! » 3లో

# ఉగ్రవాదులను పెంచిపోషించే దేశాలకు నిధులు,రుణాలా..?






- ఉగ్రవాద మద్దతుదారులను, బాధితులను ఒకేలా పరిగణించడం ఏమిటి?
- పాకిస్తాన్ ఉగ్రవాద ఉత్పత్తి కేంద్రంగా మారింది
- జీ7 సదస్సులో ప్రధాని మోదీ

ఈ కబురు: తమ పొరుగుదేశం పాకిస్తాన్ ఉగ్రవాద ఉత్పత్తి కేంద్రంగా మారిపోయిందని భారత ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. పాక్ పాలకులు ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్నారని ధ్వజమెత్తారు. ఉగ్రవాదం విసురుతున్న సవాళ్లపై స్పందించకుండా కళ్లు మూసుకొని ఉంటే మానవత్వానికి ద్రోహం చేయడమే అవుతుందని తేల్చిచెప్పారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం కెనడాలో జీ7 కూటమి సదస్సులో 'ఇంధన భద్రత' అంశంపై ప్రధాని మోదీ ప్రసంగించారు. సీమాంతర ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతిస్తున్న పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రవాద దాడి ప్రతి భారతీయుడి ఆత్మ, గుర్తింపు, గౌరవంపై జరిగిన ప్రత్యక్ష దాడేనని తేల్చిచెప్పారు. ఉగ్రవాదానికి మద్దతిచ్చే ఏ దేశమైనా తగిన మూల్యం చెల్లించక తప్పదని పేర్కొన్నారు. ముష్కర మూకలను అంతం చేసే విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు తావు ఉండొద్దని ఉద్ఘాటించారు. ఉగ్రవాదాన్ని పోషకులను, ఉగ్రవాద బాధితులను ఒకే గాటన కట్టడం, ఒకేలా పరిగణించడం ఏమిటని నిలదీశారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

**నిజంగా నిజాయతీగా పని చేస్తున్నామా?**

"ఉగ్రవాదం మానవత్వానికి బద్ధ శత్రువు. ప్రజాస్వామ్య విలువలు పాటించే అన్ని దేశాలనూ ఉగ్రవాదం వ్యతిరేకిస్తోంది. ఉగ్రవాద భూతాన్ని సమూలంగా నాశనం చేయాలంటే ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పనిచేయాలి. అన్ని దేశాలు ఐక్యంగా ఉంటేనే అనుకున్నది సాధించగలం. దురదృష్టవశాత్తూ మా పొరుగుదేశం ఉగ్రవాదులను ఉత్పత్తి చేసే కర్మాగారంగా మారిపోయింది. ప్రపంచ శాంతి, సౌభాగ్యాల కోసం.. ఉగ్రవాదులకు అండగా నిలిచే దేశాలను శిక్షించాలి. అలాంటి దేశాలను జవాబుదారీగా మార్చాలి.

తరువాయి 2లో

# మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి ఎన్‌కౌంటర్



**ఏపీలోని కింటుకూరు అడవుల్లోఎదురుకాల్పులు.. చలపతి భార్య అరుణ, మరో మహిళా మావోయిస్టు కూడా మృతి**

**పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న రవి**

రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా) ఈ కబురు, పాడేరు : ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలంలోని కింటుకూరు అటవీ ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు కీలక నేతలు సహా ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. కింటుకూరు అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో గ్రేహౌండ్స్ బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈ నేపథ్యంలో మావోయి స్టుల కు, గ్రేహౌండ్స్ బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకు న్నాయి. ఈ ఘటనలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఏఓబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి, 2004 శాంతి చర్చల ప్రతినిధి గాజర్ల రవి అలియాస్ గణేష్, అలియాస్ ఉదయ్, అలి యాస్ బిర్సు, ఏఓబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు అరుణ, ఏఓబీ జోనల్ కమిటీ ఏరియా

తరువాయి 3లో

# తెలంగాణ హక్కుల పరిరక్షణకు కలిసి నడుద్దాం

**ఆంధ్రప్రదేశ్ చేపట్టిన పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ హక్కుల పరిరక్షణకు కలిసిరావాలన్న ప్రభుత్వ విజ్ఞప్తికి అఖిలపక్ష పార్టీల ఎంపీలు మద్దతు ప్రకటించారు.**



ఈ కబురు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ చేపట్టిన పోలవరంబనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ హక్కుల పరిరక్షణకు కలిసిరావాలన్న ప్రభుత్వ విజ్ఞప్తికి అఖిలపక్ష పార్టీల ఎంపీలు మద్దతు ప్రకటించారు. ఈ ప్రాజెక్టుపై కార్యాచరణకుగాను బుధవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్రానికి చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కాగా... భాజపా ఎంపీలు డీకే అరుణ, రఘునందన్‌రావు, భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతోపాటు కాంగ్రెస్ ఎంపీలు, నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బనకచర్ల ప్రాజెక్టుపై ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, గోదావరి బేసిన్ ప్రాజెక్టులపై డిప్యూటీ డైరెక్టర్ సుబ్రహ్మణ్య ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టులు, వాటి కింద నీటి వినియోగం, సబ్ బేసిన్‌లోని ప్రవాహాల వివరాలను వెల్లడించారు. సమావేశం అనంతరం అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో తీర్మానం చేద్దామని సీఎం ప్రతిపాదించారు. సమావేశంలో సీఎం చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాలు కాపాడుకునేలా ఉన్నాయని నిరసిస్తూ భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర వాకౌట్ చేశారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు మద్దతు ఇవ్వనున్నట్లు ఎంఐఎం ఎంపీ పేర్కొన్నారు.

**ఏపీ నిర్ణయం తెలిసిన నాటి నుంచే ప్రయత్నాలు**

పోలవరం నుంచి బనకచర్లకు గోదావరి నీటిని మళ్లించేందుకు ఏపీ సిద్ధమవుతున్నట్లు తెలిసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బనకచర్లను అడ్డుకునేందుకు అన్ని పార్టీలు కలిసి పోరాటం చేద్దామని ప్రతిపాదించారు. రాష్ట్రం వాదనలను వినిపించేందుకు న్యాయనిపుణుల పేర్లను సూచించాలని అఖిలపక్ష పార్టీల ఎంపీలను కోరారు.

తరువాయి 2లో


# ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు.. కోహ్లీ స్థానాన్ని భర్తీ చేసేదెవరో చెప్పిన పంత్

» 6లో



# పూరి చిత్రంలో సంయుక్త

» 5లో



# తలదూర్చితే చావుదెబ్బ తప్పదు.. ట్రంప్‌కు ఖమేనీ వార్నింగ్!



**ఈ కబురు,తెహ్రాన్:**

హెచ్చరికలు,అల్టిమేటంలు ఆఖరికి చంపుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు బెదిరింపులకు దిగినా సరే వెనక్కి తగ్గబోమని ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీ(83) ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ భీకర దాడుల్లో ఖమేనీ తన సన్నిహితులతో పాటు సైన్యంలో కీలక పాత్రపోషిస్తున్న అధికారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ తరుణంలో ఖమేనీ లొంగిపోవాలని నెతన్యాహు,ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. అయితే, ఆ బెదిరింపులకు తానేమి లొంగిపోనని, కాదు కూడదని ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంలో తలదూర్చాలని చూస్తే కోలుకోలేని నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ట్రంప్‌కు వార్నింగ్ ఇచ్చారు.

తరువాయి 2లో

# ఏసీబీకి కేటీఆర్ లేఖ



**ఈ కబురు, హైదరాబాద్: ఫార్ములా–ఈ కేసు విచారణ సందర్భంగా మొబైల్ ఫోన్‌లతోపాటు ల్యాప్‌టాప్ ఇవ్వాలని ఏసీబీ కోరడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభ్యంతరం తెలిపారు. ఈ మేరకు కేటీఆర్ ఏసీబీకి లేఖ రాశారు.**

తరువాయి 2లో

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

» 4లో



# బనకచర్ల.. కేసీఆర్ పాపమే!

***"ఏపీ చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు కేసీఆర్ హయాంలోనే బీజం పడింది. ఆనాడు పలుమార్లు ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. తెలంగాణ ప్రయోజనాల విషయంలో మేం రాజీ పడం" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.***

- 016 నాటి ఎపెక్స్ కౌన్సిల్‌లో ఆయన వ్యాఖ్యలతోనే బీజం
- గన్‌తో భేటీలోనూ నీటి తరలింపును ప్రోత్సహించారు
- ఏపీ ప్రయత్నాలపై మేం తక్షణం అప్రమత్తమయ్యాం
- రాష్ట్ర ప్రయోజనాల కోసం న్యాయ, రాజకీయ పోరాటం
- అందరం వెళ్లి ప్రధానినీ కలుస్తాం
- గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీల వినియోగానికి చంద్రబాబు తెలంగాణకు
- ఎన్‌వోసీ ఇవ్వాలి

  అలా చేస్తే ఏపీలో ఎన్ని ప్రాజెక్టులైనా కట్టుకోవచ్చు
- అఖిలపక్ష భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు




ఈ కబురు, హైదరాబాద్: "ఏపీ చేపట్టిన గోదావరిబనకచర్ల ప్రాజెక్టుకు కేసీఆర్ హయాంలోనే బీజం పడింది. ఆనాడు పలుమార్లు ఆయన చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. తెలంగాణ ప్రయోజనాల విషయంలో మేం రాజీ పడం" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయమై బుధవారం అఖిలపక్ష ఎంపీలతో నిర్వహించిన భేటీ అనంతరం..సీఎం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు ఎవరినైనా కలుస్తాం. ఎవరితోనైనా కొట్లాడతాం. సామదాన భేద దండోపాయాల్లో మొదటి అంకంలో ఉన్నాం. గురువారం కేంద్ర జలశక్తి మంత్రితో సమావేశమవుతాం. అవసరమైతే ప్రధానినీ కలుస్తాం. అయినా ఫలితం లేకపోతే న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తాం.

తరువాయి 2లో




# బనకచర్లపై సీఎం స్పందించకపోవడం దారుణం: ఎమ్మెల్సీ కవిత


ఈ కబురు:బంజారాహిల్స్, న్యూస్‌టుడే: బనకచర్ల ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం దారుణమని, తెలంగాణకు ఆయన తీరని ద్రోహం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బుధవారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. "గోదావరి జలాలు తీసుకెళ్లేందుకు కేసీఆర్ ఒప్పుకొన్నారంటూ ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. ఏపీ మాజీ సీఎం జగన్ గతంలో పోలవరం నుంచి లింకేజీ ప్రతిపాదన చేయగా... కేసీఆర్ వ్యతిరేకించారు. బనకచర్ల ప్రాజెక్టులో భాగంగా బొల్లాపల్లి వద్ద భారీ రిజర్వాయర్ నిర్మించి నల్లమల అడవిని ముంచేసే కుట్ర జరుగుతోంది. దీనిపై తెలంగాణ జాగృతి తరఫున న్యాయపోరాటం చేస్తాం" అని కవిత పేర్కొన్నారు. తన కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు రావడం లేదని మీడియా రాస్తోందని... వస్తున్న వారంతా భారాస వారేనని, కేసీఆర్ వెంట ఉన్నవారేనని పేర్కొన్నారు. బీసీ బిల్లుపై జులై 17న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే రైల్‌రోకోతో కేంద్రం దిగిరాకపోతే పార్లమెంటు సమావేశాల సమయంలో దిల్లీలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.

# భారత్‌పాక్ ఒప్పందంలో మీ ప్రమేయం లేదు: ట్రంప్‌తో మోదీ స్పష్టం

***పాకిస్థాన్ అభ్యర్థన మేరకే 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశామని ప్రధాని మోదీ తెలిపారు. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా ప్రమేయం లేదని స్పష్టం చేశారు.***



ఈ కబురు:భారత్‌పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను తామే ఆపామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల పదేపదే చాటుకున్న సంగతి తెలిసిందే. దీనిపై తీవ్ర చర్చే నడిచింది. ట్రంప్‌ప్రకటనపై స్పష్టతనివ్వాలని అటు ప్రతిపక్షాలు కూడా డిమాండ్ చేశాయి. ఈక్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోదీతొలిసారిగా దీనిపై స్పందించారు. భారత్‌పాక్ మధ్య ఒప్పందం విషయంలో అమెరికా ప్రమేయం లేదని తేల్చిచెప్పారు. ఈ విషయాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడికి స్పష్టంగా చెప్పినట్లు కేంద్ర విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. "జీ7 శిఖరాగ్ర సదస్సు అనుబంధంగా ప్రధాని మోదీట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగాల్సి ఉంది. అయితే, అమెరికా అధ్యక్షుడు ముందుగానే వెళ్లిపోవడంతో వీరు సమావేశం కాలేకపోయారు. అనంతరం వీరిద్దరూ 35 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తర్వాత ట్రంప్.. మోదీకి ఫోన్ చేసి సంతాపం తెలియజేశారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో అండగా ఉంటామన్నారు. ఆ తర్వాత నుంచి నుంచి వీరిద్దరూ మాట్లాడుకోవడం మళ్లీ ఇప్పుడే. కాబట్టి.. 'ఆపరేషన్ సిందూర్ ' వివరాలను ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడికి వివరించారు" అని మిస్రీ తెలిపారు. "పహల్గాం, ఆపరేషన్ సిందూర్ పరిణామాల సమయంలో భారత్‌అమెరికా మధ్య ఏ స్థాయిలోనూ వాణిజ్య ఒప్పందం గురించి చర్చలు జరగలేదు. భారత్‌పాకిస్థాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వానికి అంశంపైనా చర్చలు కూడా జరగలేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్‌పాక్ మధ్య మిలిటరీ స్థాయి చర్చలు జరిగాయి. పాక్ అభ్యర్థన మేరకే 'ఆపరేషన్ సిందూర్'ను నిలిపివేశాం. ఇప్పుడు, ఎప్పుడూ.. భారత్ ఇతరుల మధ్యవర్తిత్వాన్ని అంగీకరించబోదనే విషయాన్ని అమెరికా అధ్యక్షుడికి మోదీ స్పష్టంగా చెప్పారు. ఈ విషయంపై భారత్‌లో పూర్తి రాజకీయ ఏకాభిప్రాయం ఉంది" అని మిస్రీ వివరించారు. ఇక కెనడా నుంచి తిరిగివెళ్తుండగా అమెరికా రావాలని ట్రంప్.. మోదీని ఆహ్వానించినట్లు మిస్రీ తెలిపారు. అయితే, ముందస్తు షెడ్యూల్ కారణంగా తాను రాలేనని భారత ప్రధాని వివరించినట్లు పేర్కొన్నారు. త్వరలోనే ద్వైపాక్షికంగా భేటీ కావాలని ఇరు దేశాధినేతలు నిర్ణయించినట్లు చెప్పారు. "భారత్‌లో జరిగే క్వాడ్ తదుపరి సమావేశం కోసం ట్రంప్‌ను మోదీ ఆహ్వానించారు. దీన్ని అంగీకరించిన అమెరికా అధ్యక్షుడు.. భారత్‌లో పర్యటించేందుకు ఉత్సుకతతో ఉన్నానని తెలిపారు" అని మిస్రీ వెల్లడించారు.



# జియో బ్లాక్‌రాక్ కొత్త ప్లాట్‌ఫామ్ 'అలాదీన్'

**జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను మరింత సులభతరం చేసేందుకు 'అలాదీన్' ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది.**

» 4లో

మొదటి పేజీ తరువాయి

# ఉగ్రవాదులను పెంచిపోషించే దేశాలకు నిధులు,రుణాలా..?






కానీ, వాస్తవ పరిస్థితి మరోలా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలకు నిధులు, రుణాలు ఇచ్చి సత్కరిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఉగ్రవాదంపై పోరాటంలో మనం నిజంగా నిజాయతీగా పని చేస్తున్నామా? ఉగ్రవాదం మన ఇంటి తలుపు తట్టినప్పుడు మాత్రమే ఉగ్రవాదానికి అసలైన అర్థాన్ని తెలుసుకుంటామా? ఉగ్రవాదులను ఎగదోస్తున్న వారిని, ఉగ్రవాద బాధితులను ఒకేలా చూడడం ఏమిటి? మన అంతర్జాతీయ సంస్థలు విశ్వసనీయత కోల్పోతున్నాయి. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో నిర్ణయాత్మక చర్యలు అవసరం.

ఇంధన భద్రత మన బాధ్యత

భవిష్యత్తు తరాల కోసం ఇంధన భద్రత సాధించడమే ఇప్పుడు మన ముందున్న అతిపెద్ద సవాలు. ఇంధన భద్రత సాధించడం కేవలం ప్రాధాన్యత మాత్రమే కాదు.. పౌరుల పట్ల మన బాధ్యత కూడా. ఇంధనం రంగంలో ప్రపంచ దేశాలు పరస్పరం సహకరించుకోవాలి. కలిసి పనిచేయాలి. 'నేనొక్కడినే కాదు.. మనమంతా' అనే స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలి. ప్రపంచంలో ఎక్కడైనా సంక్షోభాలు, అనిశ్చిత పరిస్థితులు ఏర్పడినప్పుడు ఇంధన సరఫరా లేక గ్లోబల్ సౌత్ దేశాలు నష్టపోవాల్సి వస్తోంది.

వాటిపై అధిక భారం పడుతోంది. ఆయా దేశాల్లో ఆహార, ఇంధన, ఎరువులతోపాటు ఆర్థిక సంక్షోభాలు తలెత్తుతున్నాయి. తయారీ, రవాణా రంగాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ఇలాంటి సమస్యల పరిష్కారానికి ఇంధన రంగంలో స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాం. కృత్రిమ మేధ(ఏఐ)ను ప్రపంచ సౌభాగ్యం కోసం ఒక శక్తిగా మార్చాలి. డీప్‌ఫేక్స్ పెద్ద ముప్పుగా మారుతున్నాయి. దీనిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. ఏఐతో సృష్టించే కంటెంట్‌లో వాటర్‌మార్క్ ఉండేలా చర్యలు తీసుకోవాలి'' అని ప్రధాని మోదీ సూచించారు.

జీ7 దేశాల అధినేతలతో మోదీ చర్చలు

కెనడాలో జీ7 సదస్సు సందర్భంగా కూటమి దేశాల అధినేతలతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టెక్నాలజీ, వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఉగ్రవాదంపై పోరాటంతోపాటు ప్రపంచానికి ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారంపై చర్చించారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యూంగ్, ఫ్రాన్స్ అధినేత ఇమ్మానుయేల్ మాక్రాన్, బ్రిటిష్ ప్రధాని కీర్ స్టార్మర్, ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనీ, మెక్సికో ప్రెసిడెంట్ క్లాడియా షీన్‌బామ్ పార్డో, జర్మనీ చాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బానీస్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇన్సియో లులా డసిల్వా, కెనడా ప్రధాని మార్క్ కార్నీ. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా తదితరులతో మోదీ భేటీ అయ్యారు.

క్రొయేషియా ప్రధాని ప్లెంకోవిచ్‌తో చర్చలు

ప్రధాని మోదీ కెనడా పర్యటన ముగించుకొని బుధవారం క్రొయేషియా చేరుకున్నారు. జాగ్రెబ్ ఎయిర్‌పోర్టులో క్రొయేషియా ప్రధానమంత్రి అండ్రెజ్ ప్లెంకోవిచ్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. క్రొయేషియాలో పర్యటిస్తున్న మొట్టమొదటి భారత ప్రధానమంత్రి మోదీయే కావడం విశేషం.

ట్విట్టర్‌లో పోరాటం సాగిస్తున్నారా?

కెనడాలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్, ప్రధాని మోదీ మధ్య సరదా సంభాషణ జరిగింది. ''ఈరోజుల్లో మీరు ట్విట్టర్‌లో పోరాటం సాగిస్తున్నారా? ట్విట్టర్‌లో మీరు చాలా చురుగ్గా ఉంటున్నారు'' అని మాక్రాన్‌ను ఉద్దేశించి మోదీ వ్యాఖ్యానించడంతో అక్కడ నవ్వులు విరిశాయి. మాక్రాన్, మోదీ సైతం బిగ్గరగా నవ్వేశారు. ఇటీవల వియత్నాం పర్యటనకు వెళ్లినప్పుడు విమానం దిగే సమయంలో మాక్రాన్‌ను ఆయన భార్య బ్రిగెట్టా నెట్టివేసినట్లు వీడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ.. ఇలాంటివి జరిగేటప్పుడు తలుపులు మూసి ఉన్నాయో లేదో చూసుకోవాలి అని మాక్రాన్‌కు సలహా ఇచ్చారు. ఈ ఉదంతాన్ని గుర్తుచేస్తూ మోదీ సరదాగా వ్యాఖ్యానించారు. మోదీ-మాక్రాన్ సంభాషణ పట్ల సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయి. మోదీ నవ్వుతూ మాట్లాడుతూనే మాక్రాన్‌కు గట్టిగా చురక అంటించారని నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

మొదటి పేజీ తరువాయి

# తెలంగాణ హక్కుల పరిరక్షణకు కలిసి నడుద్దాం



బనకచర్ల ప్రాజెక్టుపై రాజకీయ ప్రయోజనాల కన్నా రైతాంగ ప్రయోజనాలే ముఖ్యమని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ సందర్భంగా పేర్కొన్నారు. 'ప్రాజెక్టుపై ఉన్న అభ్యంతరాలను కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, భూపేంద్ర యాదవ్‌ల దృష్టికి తీసుకెళ్తున్నాం. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రానికి చెందిన ఎంపీలంతా ప్రతిఘటించాలని కోరాం. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర విఘాతం తప్పదు. రూ.81,900 కోట్లతో పోలవరం జలాశయం నుంచి కృష్ణా నది మీదుగా వరద నీటిని పెన్నాకు తరలించడానికి మూడు భాగాలుగా నిర్మిస్తున్నారు. 417 కిలోమీటర్ల దూరంలో కాలువలు, పైపులు, సొరంగాలతో పాటు తొమ్మిది విద్యుత్ ఆధారిత ఎత్తిపోతల పథకాలకు రూపకల్పన చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్‌ను మార్చడమే కాకుండా గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ ఆదేశాలను కూడా విస్మరిస్తున్నారు. గోదావరి జలాశయాల్లో 968 టీఎంసీల నీటి వాటాను కాదని అదనపు వరద నీటిని తరలించుకునే ఎత్తుగడలో భాగంగానే ఈ ప్రాజెక్టుకు ఏపీ రూపకల్పన చేసింది. భద్రాచలం రామాలయంతో పాటు మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం నుంచి తెలంగాణఏపీ సరిహద్దుల్లో ఉన్న గ్రామాలు ముంపునకు గురవుతాయి. గోదావరి నీటి సమస్యల ట్రైబ్యునల్ తుది ఉత్తర్వుల ప్రకారం తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సూచనల మేరకే షెడ్యూల్‌లో మార్పులు చేయాలన్న నిబంధనలు ఉన్నాయి' అని ఉత్తమ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నుంచి ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్, బలరాం నాయక్, వంశీకృష్ణ, సురేష్ షెట్కార్, రఘువీర్, రేణుకాచౌదరి, రఘురాంరెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి, సంజయ్ వచ్చి ఉంటే బాగుండేది

అఖిలపక్ష సమావేశానికి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌లను గౌరవ అతిథులుగా ఆహ్వానించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. వారు హాజరై ఉంటే బాగుండేదంటూ భాజపా ఎంపీలతో పేర్కొనగా.. తమను కిషన్‌రెడ్డి పంపారని ఎంపీలు డీకే అరుణ, రఘునందన్‌రావు తెలిపారు. తెలంగాణ హక్కులు, బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా కలిసివస్తామని వారు చెప్పారు. ప్రభుత్వం చెబుతున్న నీటి వినియోగం వివరాలను తమకు అందించాలని డీకే అరుణ కోరారు.

తెలంగాణ హక్కుల పరిరక్షణకు భారాస మొదటి నుంచీ కట్టుబడి ఉందని భారాస రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. బనకచర్ల ప్రాజెక్టు అక్రమమని, తమ పార్టీ వ్యతిరేకిస్తోందని చెప్పారు. ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రానికి వరప్రదాయిని అయిన కాళేశ్వరం రెండు పియర్లు కుంగితేనే గాలికి వదిలేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు జారీ చేయడం లేదని పేర్కొన్నారు.

నేడు దిల్లీకి రేవంత్, ఉత్తమ్

కేంద్ర మంత్రులను కలిసేందుకు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర జలశక్తి శాఖ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రులతో వారు భేటీ కానున్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఏసీబీకి కేటీఆర్ లేఖ

ఫార్ములా ఈ కారు రేసు కేసులో కేటీఆర్ ఏసీబీ అధికారుల విచారణను ఎదుర్కొంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కేటీఆర్ ఏసీబీ ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణలో భాగంగా ఏసీబీ అధికారులు 2021 నవంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు వాడిన ఫోన్లు కావాలని కేటీఆర్‌ను అడిగారు. ఇదే అంశంపై కేటీఆర్ ఇవాళ ఏసీబీ అధికారులకు లేఖ రాశారు. ఆ లేఖలో 2024లో ఫోన్లు మార్చాను. గతంలో వాడిన ఫోన్లు నా దగ్గర లేవు. 2021 నవంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు వాడిన ఫోన్లు కావాలని అడిగిన ఏసీబీ. ఫోన్లు అడగడం అంటే వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినట్లేనని అందులో పేర్కొన్నారు.

ఏసీబీ అధికారులు ఫోన్లను అడగడంపై కేటీఆర్ తన న్యాయవాదులతో చర్చించినట్లు తెలుస్తోంది. ఈ చర్చల్లో 'విచారణ సంస్థలు ఒక పౌరుడి నుంచి సేకరించిన సమాచారాన్ని తిరిగి అదే పౌరునిపై వాడే కుట్ర చేయడం అన్యాయమని గతంలో కోర్టులు పలు తీర్పులు ఇచ్చాయి. వ్యక్తిగతంగా వాడే ఫోన్లను కోర్టు తీర్పు లేకుండా ఇవ్వాల్సిన అవసరం లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, ఐటీ చట్టం ప్రకారం ఏసీబీ తీరు వ్యక్తిగత హక్కులకు విఘాతం కలిగిస్తుంది. ఈ చట్ట ప్రకారం కేవలం కోర్టు తీర్పుతోనే విచారణ సంస్థలు మొబైల్, ల్యాప్‌టాప్ లాంటి వ్యక్తిగత ఉపకరణాలు అడగవచ్చు. ఎలాంటి ప్రజాప్రయోజనం లేని సందర్భంలో విచారణ సంస్థలు ఇలాంటి ఆదేశాలు ఇవ్వలేవన్నారు. ఈ కేసు పూర్తిగా రాజకీయ వేధింపుల కోణంలో జరుగుతోంది' అని కేటీఆర్‌కు న్యాయవాదులు వివరించినట్లు సమాచారం.

మొదటి పేజీ తరువాయి

# బనకచర్ల.. కేసీఆర్ పాపమే!



అక్కడా కాకపోతే రాజకీయ పోరాటం చేస్తాం.'' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ''నదీ జలాల విషయంలో కేసీఆర్ చేసిన పాపంలో భాగంగానే బనకచర్ల ప్రాజెక్టు సమస్య కూడా వచ్చింది'' అంటూ నిప్పులు చెరిగారు. ''గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ అడ్డు పడుతోంది. గోదావరిలో 1,000, కృష్ణా నదిలో 500 మొత్తం 1,500 టీఎంసీల నీటిని తెలంగాణ వాడుకునేందుకు ఏపీ సీఎం చంద్రబాబు నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇస్తే.. ఆ రాష్ట్రం కట్టుకునే ప్రాజెక్టులకు అడ్డు చెప్పబోం' అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**కేసీఆర్ చేసిన ద్రోహాలతోనే..**

''భారాస నేతలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో మరోలా మాట్లాడుతూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. 21.09.2016న కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమాభారతితో పాటు.. తెలుగు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, చంద్రబాబు.. మంత్రులుగా దేవినేని ఉమా, హరీశ్‌రావు పాల్గొన్నారు. గోదావరి, కృష్ణా నదీ జలాల వినియోగంపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. ఎనిమిది పేజీల మీటింగ్ మినిట్లు (కాగితాల్ని చూపిస్తూ) ఉన్నాయి. ఆ సందర్భంలో కేసీఆర్.. ''గోదావరి నుంచి మూడు వేల టీఎంసీల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు వెయ్యి టీఎంసీల నీళ్లు అవసరం. గోదావరి నుంచి కృష్ణాకు నీళ్లు తరలించి ఉపయోగించవచ్చు'' అని సూచించారు. అలా కేసీఆర్ వైఖరితో తెలంగాణకు జరగబోయే నష్టానికి పునాదిరాయి ఆనాడే పడింది. గోదావరి నుంచి రాయలసీమకు నీళ్లు ఇవ్వవచ్చని అన్నారు. ఈ మీటింగ్ మినిట్స్ హరీశ్‌రావుకు పంపిస్తా. కేసీఆర్, ఏపీ నాటి సీఎం జగన్ మధ్య ప్రగతిభవన్‌లో నాలుగు సమావేశాలు జరిగాయి. వారిద్దరూ కూర్చుని గోదావరి జలాల్ని రాయలసీమకు తరలించాలని నిర్ణయించారు. సీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తానని కేసీఆర్ ఆనాడే జగన్‌కు హామీ ఇచ్చారు. ఆనాడు కేసీఆర్, జగన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారమే చంద్రబాబు ఇప్పుడు ముందుకు వెళుతున్నారు. ఇవాళ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభిస్తామని చంద్రబాబు అనగానే.. భారాస వ్యతిరేకిస్తోంది. గోదావరిబనకచర్లను కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తోంది. నేను భారాసను, కేసీఆర్‌ను అడుగుతున్నా.. 2016లో, వివిధ సందర్భాల్లో, శాసనసభలో.. గోదావరి జలాల్ని రాయలసీమకు.. అదే విధంగా పెన్నా బేసిన్‌కు తరలించడాన్ని మీరు ఆమోదించారు. ప్రాజెక్టుల నిర్మాణం ప్రారంభించడానికి అవకాశం కల్పించారు. ఈ రోజు బనకచర్లను ప్రారంభిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు అన్న మరుక్షణం.. నేను, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దిల్లీ వెళ్లి జలశక్తి మంత్రిని కలిసి ఫిర్యాదు చేశాం. ఇతర కేంద్ర మంత్రులకూ ఫిర్యాదు చేశాం. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు దృష్టికీ తీసుకెళ్లాం. ఏపీ ప్రభుత్వం, ఏపీ సీఎం.. బనకచర్ల ద్వారా 200 టీఎంసీల గోదావరి జలాల్ని తరలించేందుకు ప్రణాళిక రూపొందించారని చెప్పాం. పరోక్షంగా మరో 100.. మొత్తం 300 టీఎంసీల తరలింపునకు సివిల్ పనులు చేస్తున్నారు. కాలువలు, సొరంగాలు, రిజర్వాయర్లు.. 300 టీఎంసీల కోసం నిర్మించేలా ప్రణాళిక వేశారు. ఆనాడు కేసీఆర్ 400 టీఎంసీల తరలింపునకు ప్రతిపాదన ఇచ్చారు. రాయలసీమ, పెన్నా బేసిన్లకు తరలించవచ్చని కేసీఆర్ సూచించారు.

**కేసీఆర్, హరీశ్‌లను శిక్షించాలి**

బనకచర్లపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో స్పందిస్తుంటే హరీశ్ మాత్రం నాపై, ఉత్తమ్‌పై బురద చల్లుతున్నారు. ఈ పాపానికి పునాది వేసింది కేసీఆరే. 2016లో జరిగిన సమావేశంలో హరీశ్‌రావు ఉన్నారు. నదీ జలాల్లో తెలంగాణకు జరిగిన నష్టంపై కేసీఆర్‌ని, హరీశ్‌రావునే శిక్షించాలి. కాంట్రాక్టర్లు ఇచ్చే కమీషన్ల కోసం భారాస తెలంగాణకు అన్యాయం చేసింది. ఒక కాంట్రాక్టర్ పెట్టిన సమావేశంలో కూర్చుని.. కమీషన్లకు కక్కుర్తి పడి.. గోదావరి వరదజలాల్లో 400 టీఎంసీల నీళ్లను రాయలసీమకు తీసుకెళ్లవచ్చని అన్నారు. ఇప్పుడు మీ చేతిలో అధికారం లేదని.. ఆ బురదను మాకు అంటిస్తారా? నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో పార్టీని పెట్టి అధికారంలోకి వచ్చిన మీరు.. కృష్ణా బేసిన్‌లో (ఉమ్మడి ఏపీలో) చేపట్టిన ఒక్క ప్రాజెక్టునైనా పూర్తి చేశారా కేసీఆర్? ఆనాడు తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టి ఉంటే.. లిఫ్టు లేకుండానే గ్రావిటీ ద్వారానే ప్రాజెక్టులన్నీ పూర్తయ్యి.. ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం అయ్యేది. కానీ కాసుల కక్కుర్తితో తుమ్మిడిహెట్టి దగ్గర కట్టకుండా వదిలేశారు. కాళేశ్వరం వల్ల రూ.లక్ష కోట్ల ధనం ఆవిరైపోయింది. కేసీఆర్ ధనదాహం.. దోపిడీ వల్ల మేడిగడ్డ కుప్పకూలింది. ఒక్క పిల్లర్ కూలిపోతే ఏమైంది ప్రాజెక్టు ఉంది కదా? అంటున్నారు హరీశ్‌రావు. మేడిగడ్డ గుండెకాయ లాంటిది. ఆ గుండెనే లేకపోతే మిగతా శరీరం ఎందుకు? అఖిలపక్ష సమావేశం పెడితే భారాస ముఖ్య నాయకులు రాలేదు. రాయలసీమ ఎత్తిపోతల జీఓ కేసీఆర్ ఇంట్లో తయారైంది. చంద్రబాబు ముచ్చుమర్రి కడుతుంటే కేసీఆర్ మాట్లాడలేదు.

**మేం ప్రాజెక్టులు కట్టకుండా మిగులు జలాలెక్కడ?**

చంద్రబాబుకు సూచనలు చేస్తున్నా.. గోదావరిలో మూడు వేల టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయని మీరు నమ్మితే.. గోదావరి బేసిన్‌లో తెలంగాణకు 968 టీఎంసీల నీటి కేటాయింపులున్నాయి. ఆ నీటికి బ్లాంకెట్‌గా ఎన్‌ఓసీ మీరు ఇవ్వండి. తెలంగాణలో 968 టీఎంసీలకు ప్రాజెక్టులు కట్టుకున్నాక.. కిందికి వెళితే అవి వరదజలాలు అవుతాయి. కేసీఆర్ తెలంగాణకు చేసిన ద్రోహం వల్ల మిగులు జలాలు ఏపీకి వరదగా వెళుతున్నాయి. మేడిగడ్డ కూలింది.. అన్నారం అక్కరకు రాలేదు.. అవి సక్రమంగా ఉండి ఉంటే.. నీళ్లు మేం ఎత్తిపోసుకుంటే.. మిగులు జలాలు ఏపీకి వచ్చేవో, రావో తెలిసేది. కృష్ణా బేసిన్ మొత్తాన్ని ఏపీ కొల్లగొట్టింది. ఇప్పుడు గోదావరి బేసిన్‌కు వచ్చింది. చివరగా చంద్రబాబుకు నేను చెప్పేది ఒక్కటే.. మనం దూరం పెంచుకోవడం ద్వారా సమస్య పరిష్కారం కాదు.. మా తెలంగాణ ప్రాజెక్టులకు గోదావరి బేసిన్‌పై 968 టీఎంసీలు.. కృష్ణా బేసిన్‌లో పరీవాహక ప్రాంతం ప్రకారం... 555 టీఎంసీల నీళ్లు వస్తాయి.. మేం కొన్ని ప్రాజెక్టులు కట్టుకుంటాం. ఈ రెండింటికీ మీరు స్పష్టంగా అనుమతి ఇవ్వండి. ఆ తర్వాత సముద్రంలోకి వెళ్లే నీటిని మీరు ఎంత తీసుకెళ్లినా మాకు అభ్యంతరం లేదు.

**కిషన్‌రెడ్డిని నమ్మే పరిస్థితి లేదు**

కీలకమైన అఖిలపక్ష సమావేశానికి రాకుండా పని ఉందంటూ దిల్లీ వెళ్లిన కిషన్‌రెడ్డిని నమ్మే పరిస్థితి లేదు. గురువారం జలశక్తిమంత్రిని మేం కలవబోతున్నాం. ఆయన ఒక రోజు ముందే జలశక్తిమంత్రిని ఎందుకు కలిశారు? అన్నిరకాలుగా తెలంగాణకు ద్రోహం చేస్తున్నారు. నీళ్ల సెంటిమెంట్‌తో భారాసను బతికించాలని ఆయన ప్రయత్నిస్తున్నారు.

30 కల్లా నివేదిక ఇస్తాం..

కాళేశ్వరం ప్రాజెక్టుపై మంత్రి మండలి సమావేశాల మినిట్స్ ఇవ్వాలని జస్టిస్ ఘోష్ కమిషన్ కోరింది. గత ప్రభుత్వంలో 96 సార్లు మంత్రి మండలి సమావేశాలు జరిగినా ప్రాజెక్టు అంచనాలు పెంచడానికి చేసిన తీర్మానాలు మినహా నిర్మాణానికి సంబంధించి మినిట్స్ లేవు. ఎటువంటి ఆమోదం లేకుండానే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరంగా మార్చి నిర్మించారు. ఈ వివరాలు తెలిపితే సీఎం కాళేశ్వరం కమిషన్‌ను ప్రభావితం చేస్తున్నారంటూ న్యాయ వివాదాలకు దిగుతారు. ఈ నెల 30వ తేదీలోపు నీటిపారుదల శాఖ కమిషన్ కోరిన అంశాలన్నింటినీ అందజేస్తుంది'' అని ముఖ్యమంత్రి వివరించారు.

**రాజకీయాలకు అతీతంగా కొట్లాడుదాం**

అఖిలపక్ష ఎంపీల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ''రోజుకు 2 టీఎంసీల చొప్పున.. 400 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించాలని కేసీఆర్, జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారు. ఆనాటి సమావేశ మినిట్స్‌లో ఇవన్నీ ఉన్నాయి. గోదావరిబనకచర్ల ప్రాజెక్టు అకస్మాత్తుగా మొదలైంది కాదు. 2016లోనే దీనికి బీజం పడింది. 2019లో ఒక దశకు వచ్చింది. 2025కు వచ్చే సరికి వేగవంతమైంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

గోదావరిబనకచర్లపై జరిగిన అఖిలపక్ష భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ''అన్ని పార్టీలకు సిద్ధాంతాల పరంగా విభేదాలుండొచ్చు. కానీ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా.. అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. దీనిపై భాజపా ఎంపీ రఘునందన్‌రావు ఒక సందేహం వెలిబుచ్చారు. ప్రాజెక్టులు పూర్తయి.. నికర జలాలు వాడుకున్న తర్వాత.. మిగిలితే వరద జలాలో.. మిగులో జలాలో కానీ.. ఇప్పుడు ప్రాజెక్టులకే అనుమతులు లేవు. మిగులు జలాలనేది ఎలా వచ్చింది? అని అడిగారు. దీనిపై వివరణ ఇవ్వదలుచుకున్నా. తెలంగాణ ఏర్పడిన తరువాత కేంద్రప్రభుత్వం దిల్లీలో 219 2016న నిర్వహించిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో.. గోదావరి నది నుంచి మూడు వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని ఆనాటి సీఎం కేసీఆర్ ప్రస్తావించారు. అంటే దీన్ని మొట్టమొదట కనిపెట్టింది కేసీఆర్. ఆ తర్వాత ఇది ఏ కారణాలతోనో ముందుకు సాగలేదు. మళ్లీ 2019 ఆగస్టు 13న.. ''రాయలసీమను రతనాల సీమగా మారుస్తా'' అని ఆనాటి తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం మొదలుపెట్టిన గోదావరిబనకచర్ల ప్రాజెక్టుకు బీజం అక్కడే పడింది. గత ఎపెక్స్ కౌన్సిల్ మీటింగ్ మినిట్స్‌నే ముందుపెట్టి.. మనకు దీన్ని ఒక గుదిబండగా మార్చేందుకు ఏపీ ప్రయత్నం చేస్తోంది. మూడు రకాలుగా మనం ముందుకెళ్లాలి. 1.టెక్నికల్ 2.లీగల్ 3.పొలిటికల్. రాజకీయ కోణంలో ఇప్పటి వరకూ మేం కేంద్ర మంత్రుల వద్ద అన్ని రకాలుగా ప్రయత్నాలు చేశాం. అయినా మనకు సహకారం అందడంలేదు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లోనూ దీన్ని ప్రస్తావిస్తాం. ప్రధానమంత్రి సహా అందరినీ కలిసి తెలంగాణ సమస్యను, హక్కులను, నీటి చట్టాలను వివరిస్తాం. అయినా ఫలితాలు పొందలేకపోతే.. న్యాయపరమైన పోరాటం చేద్దాం'' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**కేసీఆర్ వీడియో క్లిప్పింగుల ప్రదర్శన**

సచివాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో.. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రి హోదాలో చేసిన వ్యాఖ్యల వీడియోలను ప్రదర్శించారు. అందులో కేసీఆర్ వ్యాఖ్యలు ఇలా ఉన్నాయి..

ప్రజలందరూ బాగుండాలని కోరుకుంటాం. రాయలసీమకు నీళ్లు రావాలని నేను చెప్పిన మాట వాస్తవం. ఈ రోజు కూడా చెబుతున్నా. కృష్ణా నదిలో నీళ్లు లేవు.. గోదావరిలో ఉన్నాయి.. మేం గోదావరి నుంచి తెచ్చుకుంటున్నాం. మీరు (ఏపీ) కూడా అక్కడి నుంచి తెచ్చుకోండి. మీకు మేం సహకరిస్తామని చెప్పా. బేసిన్‌లు.. భేషజాలు అంటూ అడ్డు పెట్టం. మీకు సహకరిస్తాం. రాయలసీమ కరవు ప్రాంతం. వాళ్లకు తప్పకుండా నీళ్లు రావాలి. అది న్యాయం. మీరు తెచ్చుకోండి.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీకి ముఖ్యమంత్రి అయిన తర్వాత.. సుహృద్భావ వాతావరణంలో మాతో ఈ రోజు సమావేశానికి వచ్చారు. చర్చలు జరిగాయి. నేను చెప్పాను.. పాత బేసిన్లు లేవు.. భేషజాలు లేవు.

మొదటి పేజీ తరువాయి

# తలదూర్చితే చావుదెబ్బ తప్పదు.. ట్రంప్‌కు ఖమేనీ వార్నింగ్!

ఈ కబురు,తెహ్రాన్: హెచ్చరికలు,అల్టిమేట్టంలు ఆఖరికి చంపుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు బెదిరింపులకు దిగినా సరే వెనక్కి తగ్గబోమని ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీ(83) ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. ఇజ్రాయెల్ భీకర దాడుల్లో ఖమేనీ తన సన్నిహితులతో పాటు సైన్యంలో కీలక పాత్రపోషిస్తున్న అధికారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ తరుణంలో ఖమేనీ లొంగిపోవాలని నెతన్యాహు,ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. అయితే, ఆ బెదిరింపులకు తానేమి లొంగిపోనని, కాదు కూడదని ఇజ్రాయెల్‌ఇరాన్ యుద్ధంలో తలదూర్చాలని చూస్తే కోలుకోలేని నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ట్రంప్‌కు వార్నింగ్ ఇచ్చారు.

**ఎక్స్ వేదికగా ఖమేనీ ఏమన్నారంటే?**

ఇరాన్‌ఇజ్రాయెల్ వివాదంలో అమెరికా జోక్యం చేసుకోకూడదు. కాదు కూడదని సైనిక పరంగా జోక్యం చేసుకుంటే మాత్రం అమెరికాను కోలుకోలేని విధంగా దెబ్బకొడతామని అన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ గురించి ఖమేనీ స్పందించారు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అవివేకంతో ఇరానియన్లు తనకు లొంగిపోవాలని డిమాండ్ చేస్తున్నారు. ట్రంప్ ఎవరికో (ఇజ్రాయెల్ దేశాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ) భయపడి తమను బెదిరిస్తే.. తాము బెదిరిపోమని పునరుద్ఘాటించారు. పదేపదే అమెరికా కవ్వింపు చర్యలకు దిగితే ప్రస్తుతం ఇజ్రాయెల్ నుంచి ఇరాన్ ఎదుర్కొంటున్న హానికంటే ఎక్కువ హాని అమెరికా ఎదుర్కొవాల్సి ఉంటుందని ఇరాన్ అమెరికాకు చేయబోయే నష్టం గురించి హెచ్చరించారు.

**ఖమేనీని చంపే ఉద్దేశం మాకు లేదు.. కానీ**

సుప్రీం లీడర్ అనే వ్యక్తి ఎక్కడ దాక్కున్నాడో మాకు ఖచ్చితంగా తెలుసు. అతని ఆచూకీ పెద్ద కష్టమేమీ కాదు. అతను అక్కడ సురక్షితంగా ఉన్నాడు. ప్రస్తుతం మేం అతన్ని చంపే ఉద్దేశంతో లేము. ఖమేనేని చంపితే మా వారిపై దాడులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతానికి నాకు ఓపిక నశిస్తున్నది. ఖమేనీ భేషరతుగా లొంగిపోతే మంచిది. మా సహనాన్ని పరీక్షించొద్దు. భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు' అని పరోక్షంగా వ్యాఖ్యానించారు. ట్రంప్ ట్వీట్‌పై ఖమేనీ పైవిధంగా స్పందించారు.



# ప్రాణం తీసిన ఇష్టంలేని ఉద్యోగం...

## యూ ట్యూబ్ లో వెదికి.. తలకు కవర్లు చుట్టుకొని.. హీలియం గ్యాస్ పీల్చి...

## చార్టర్డ్ అకౌంటెంట్ ఆత్మహత్య



గ్యాస్ పీల్చి ఆత్మహత్య చేసుకున్న సురేష్ రెడ్డి (ఫైల్)

ఆత్మహత్య చేసుకునేందుకు ఉపయోగించిన హీలియం గ్యాస్ సిలిండర్

ఈ-కబురు, శేరిలింగంపల్లి : నేటి యువత జీవితంలో వచ్చే సమస్యలకు చావే పరిష్కారమని భావిస్తున్నారు. తమ రోజువారి జీవితంలో ఎదురయ్యే సవాళ్లకు భయపడి క్షనికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నగరంలో బుధవారం ఓ చార్టెడ్ అకౌంటెంట్ చేసుకున్న ఆత్మహత్య తీవ్ర విషాదాన్ని నింపింది. తాను చేస్తున్న ఉద్యోగం నచ్చక, ఆత్మహత్యే శరణ్యమని భావించిన యువకుడు నొప్పి, బాధ తెలియకుండా చనిపోయేందుకు యూట్యూబ్ ను ఎంచుకున్నాడు. యూట్యూబ్ వీడియోల ఆధారంగా హీలియం గ్యాస్ సేకరించి, తల మొత్తం ప్లాస్టిక్ కవర్లతో చుట్టుకొని హీలియం గ్యాస్ పీల్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యావంతుడైన యువకుడి ఆత్మహత్య కుటుంబ సభ్యులను శోకసంద్రంలో ముంచగా, ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఎస్సై రాజశేఖర్ రెడ్డి తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి.. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం వాడి గ్రామానికి చెందిన నిర్మల సురేష్ రెడ్డి(28) ఓ కంపెనీలో చార్టెడ్ అకౌంటెంట్ గా పని చేస్తున్నాడు. మణికొండలో తన సోదరుడు అజయ్, మరికొందరు స్నేహితులతో కలిసి నివాసం ఉంటున్నాడు. సురేష్ రెడ్డికి చార్టెడ్ అకౌంటెంట్ గా పనిచేయడం ఇష్టం లేకపోగా, తాను పనిచేస్తున్న ఉద్యోగంలోనూ పని ఒత్తిడితో సతమతం అవుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీన బందువుల వద్దకు వెళుతున్నానని, రెండు రోజుల్లో తిరిగి వస్తానని చెప్పి తాను ఉంటున్న గదిలో నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం కొండాపూర్ రాజరాజేశ్వరీ కాలనీలో గల ఎస్వీ సెరెనిటీ ఆపార్టుమెంటులో ఒక రోజు కోసం గది అద్దెకు తీసుకున్నాడు. కొద్ది సేపటికే బయటకు వెళ్లి హీలియం సిలిండర్ తీసుకొని ఎవరి కంటపడకుండా లిఫ్ట్ ద్వారా గది లోపలికి తీసుకువెళ్లాడు. గదిలో మరో రోజు ఉంటానని నిర్వాహకులకు చెప్పి పాడిగించుకున్నాడు. మంగళవారం రాత్రి తలకు ప్లాస్టిక్ కవర్ చుట్టుకొని, హీలియం గ్యాస్ సిలిండర్ పైపును కవర్ లోకి పెట్టి, బయటి నుంచి ఆక్సీజన్ రాకుండా ప్లాస్టర్లు వేసుకున్నాడు. ఆ తరవాత సిలిండర్ ను ఆన్ చేశాడు. కవర్ లోపల చేరిన హీలియం గ్యాస్ పీల్చి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హీలియం గ్యాస్ పీల్చడంతో సురేష్ శరీరం నల్లగా మారింది. బుధవారం ఉదయం గది శుభ్రం చేసేందుకు వాచ్ మెన్ వెళ్లగా స్పందించలేదు. అనుమానం వచ్చి డోర్ పగులగొట్టి చూడగా చనిపోయి ఉన్నాడు. గదిలో ఉన్న డైరీలో 'చార్టెడ్ అకౌంటెంట్ గా పని చేయడం ఇష్టం లేదని. ఇష్టంలేని ఉద్యోగం కారణంగా ఒత్తిడికి గురవుతూ ఆత్మహత్య చేసుకుంటున్నానని' రాశాడు. ఆత్మహత్యకు మానసిక ఒత్తిడే కారణమని పోలీసులు తెలిపారు. నొప్పి, బాధ లేకుండా చనిపోవడం ఎలా అని యూట్యూబ్ లో చోధించి హీలియం గ్యాస్ ను ఎంపిక చేసుకొని ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. గచ్చిబౌలి పోలీసులు సురేష్ రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

# మాగంటి గోపీనాథ్ కు నివాళులర్పించిన ఎమ్మెల్యే గాంధీ



మాగంటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ



మాగంటి కుటుంబ సభ్యులతో ఎమ్మె ల్యే గాంధీ

ఈకబురు, శేరిలింగంపల్లి : దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కు తెలంగాణ పిఏసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నివాళులర్పించారు. అనారోగ్యంతో ఈ మధ్యే మృతిచెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ దశదినకర్మను జూబ్లీహిల్స్ లోని జెఆర్సి కన్వెన్షన్ లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే నల్ల మోతు భాస్కర్ రావు, ఎమ్మెల్సీ దాసోజ్ శ్రావణ్ కుమార్, కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్ లతో కలిసి హాజరైన ఎమ్మెల్యే గాంధీ... గోపీనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. శోకసంద్రంలో ఉన్న గోపీనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సోదర సమానుడు, దివంగత మాగంటి గోపీనాథ్ అకాల మరణం అత్యంత బాధాకరమని, తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. గోపీనాథ్ లేని లోటు తీర్చలేనిదని, మాగంటి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మాగంటి కుటుంబ సభ్యులు మనో ధైర్యంతో ముందుకు సాగాలని, వారికి భగవంతుడు ధైర్యాన్ని, శక్తిని ఇవ్వాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడుసుమిల్లి వెంకటేశ్వర రావు, పాతూరి వెంకట్రావు, సాంబ శివరావు, విజయ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# లింగంపల్లి కల్లు కాంపౌండ్ లో దారుణ హత్య

### కల్లు తాగేందుకు వచ్చిన యువకుడిని కొట్టి చంపిన దుండగులు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి: లింగంపల్లి కల్లు కాంపౌండ్ లో బుధవారం దారుణ హత్య చోటు చేసుకుంది. కల్లు తాగేందుకు వచ్చిన యువకుడితో గొడవపడిన ఇద్దరు దుండగులు యువకుడిపై విచక్షణారహితంగా దాడి చేసి కొట్టి చంపారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి..**

వికారాబాద్ జిల్లా తాండూర్ మండలం సిరిగిరిపేట్ గ్రామానికి చెందిన మాసాన్పల్లి రామచందర్, పసుపు అమరేష్ (23)లు నగరానికి వలస వచ్చి లింగంపల్లి లో రాపిడో నడుపుకుంటున్నారు. రాత్రి వేళలో లింగంపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారం పై పడుకుంటూ పనులు చేసుకుంటున్నారు. కాగా మంగళవారం రాత్రి రైల్వే స్టేషన్ సమీపంలోని కల్లు కాంపౌండ్ కు ఇరువురు వెళ్లారు. అక్కడే ఉన్న ఓ మహిళ అమరేష్ ను అడ్డుకుని వారం క్రితం మా ఆడ మనిషిని బైక్ పై ఎక్కించుకుని ఎక్కడికి తీసుకెళ్లావురా అంటూ దుర్భాషలాడుతూ గొడవకు దిగింది. రాంచందర్ గొడవ ఆపేందుకు ప్రయత్నించగా పక్కనే ఉన్న మరో మహిళ వీడియో కాల్ చేసి ఇద్దరు వ్యక్తులను అక్కడికి పిలిచి, అమరేష్ ని కొట్టాలని చెప్పింది. దీంతో రెచ్చిపోయిన సదరు వ్యక్తులు అమరేష్ ని విచక్షణ రహితంగా కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే రాంచందర్...అమరేష్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, 100 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం అందజేశాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు 108 అంబులెన్స్ సిబ్బంది సహాయంతో అమరేష్ ను పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అమరేష్‌పై దాడికి దిగి కొట్టి చంపిన నిందితులు చందా నగర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

# రైతుల చేతులకు సంకెళ్లు!

**పోలీసుల తీరుపై విమర్శలు**
**ధన్వాడకు చెందిన 12 మందికి మంగళవారమే బెయిల్ మంజూరు అయినా సంకెళ్లు వేసి కోర్టులో హాజరుపరిచిన వైనం.. ముగ్గురిని సస్పెండ్ చేశామన్న గద్వాల ఎస్పీ**



ఈ కబురు,అలంపూర్: ఇథనాల్ కంపెనీ ఏర్పాటును వ్యతిరేకించే క్రమంలో చోటు చేసుకున్న గొడవతో రిమాండ్‌లో ఉన్న రైతులకు పోలీసులు సంకెళ్లు వేసి కోర్టుకు తీసుకురావడం వివాదాస్పదమైంది. వివరాల్లోకి వెళితే.. జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో గాయత్రి రెన్యూవబుల్ ఆన్‌లైన్ ఇండస్ట్రీస్ కంపెనీ ఇథనాల్ కంపెనీ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే దీనిని పెద్ద ధన్వాడతో పాటు ఆ చట్టూ ఉన్న 12 గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన కంపెనీ నిర్మాణ పనులు ఆరంభించడానికి యాజమాన్యం సామగ్రి సిద్ధం చేసుకుంది. దీన్ని ప్రజలు అడ్డుకునే క్రమంలో తీవ్ర ఉద్రికత్త చోటు చేసుకుంది. దీంతో 41 మంది రైతులపై రాజోలి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. అందులో 12 మంది రైతులను ఈ నెల 5వ తేదీన గద్వాల కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. వీరికి సంబంధించి బుధవారం వాయిదా ఉండటంతో అలంపూర్ కోర్టులో హాజరుపర్చారు. అయితే వీరి చేతులకు సంకెళ్లు వేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. అన్నం పెట్టే రైతన్నల చేతికి కరుడుగట్టిన నేరస్తుల తరహాలో సంకెళ్లు వేయడం ఏమిటంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు ఈ దృశ్యాలను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. ఆ తర్వాత మీడియాలో కథనాలుగా రావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ అంశం చర్చనీయాంశమయ్యింది. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు రైతులకు మద్దతుగా నిలిచాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దీన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం.

17నే బెయిల్ మంజూరు ఎట్టకేలకు విడుదల

మహబూబ్‌నగర్ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న రైతులకు వాస్తవానికి మంగళవారమే బెయిల్ మంజూరైంది. గద్వాల కోర్టు 12 మంది రైతులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రైతులు ఒకవైపు కోర్టు వాయిదాకు హాజరు కాగా.. మరోవైపు వారి బెయిల్‌కు సంబంధించిన జామీన్‌ల ప్రక్రియ కొనసాగింది. చివరకు బుధవారం రాత్రి రైతులు బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మాట్లాడుతూ పచ్చని పొలాల్లో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుతో రైతుల జీవితాల్లో కాంగ్రెస్ పార్టీ చిచ్చు పెట్టిందని ఆరోపించారు.

ముగ్గురు పోలీస్ అధికారుల సస్పెన్షన్

ఈ ఉదంతంపై జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావును 'సాక్షి' సంప్రదించగా..ఇందుకు కారణమైన ముగ్గురు అధికారులను సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు. రైతులను జైలు నుంచి కోర్టుకు తీసుకొచ్చే క్రమంలో పోలీస్ ఉన్నతాధికారుల సూచనలు పాటించకుండా విధుల పట్ల అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంఘటనలో ఒక ఆర్ఎస్ఐ, ఇద్దరు ఏఆర్ ఎస్ఐలను సస్పెండ్ చేశామని చెప్పారు.

# మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి ఎన్‌కౌంటర్

అలి యాస్ బిర్సు, ఏఓబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు అరుణ, ఏఓబీ జోనల్ కమిటీ ఏరియా కమిటీ సభ్యురాలు అంజు మరణించారు. వీరిలో రవి తెలంగాణ రాష్ట్రానికి చెందినవారు. ఆయన స్వస్థలం భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామం. అరుణ ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మరణించిన కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి భార్య. ఈమెది విశాఖ జిల్లా పెందుర్తి మండలం కరకవానిపాలెం. గాజర్ల రవి, అరుణపై పోలీస్ రివార్డులున్నాయి. మావోయిస్టులకు సంబంధించిన పలు కీలక సంఘటనల్లో వీరు పాల్గొన్నట్లు పోలీస్ కేసులు నమోదయ్యాయి. అంజుది ఛత్తీస్‌గఢ్ అని తెలిసింది. కాగా సంఘటన స్థలంలో పలు ఏకే-47 తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సేఫ్‌జోన్ అని..: ఆపరేషన్ కగార్ పేరిట దండకారణ్యాన్ని పోలీస్ బలగాలు జల్లెడపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులకు గట్టి ఎదురు దెబ్బలు తగిలాయి. ఈ నేపథ్యంలో పాపికొండలు, అభయారణ్యంలోని కొండమొదలు, కింటుకూరు ప్రాంతాలను సేఫ్‌జోన్‌గా భావించిన మావోయిస్టులు ఇక్కడకు వచ్చినట్లు భావిస్తున్నారు. సుమారు ఆరునెలల క్రితమే పది మంది మావోయిస్టులు కింటుకూరు అటవీ ప్రాంతానికి వచ్చినట్లు నిఘా వర్గాలు పసిగట్టాయి. ఈ నేపథ్యంలో నెల రోజుల క్రితం వై. రామవరం-కొయ్యూరు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. వెంకటలక్ష్మి చైతన్య అలియాస్ అరుణ, అలియాస్ అరుణక్క (55) మెట్రిక్యులేషన్ వరకు చదువుకున్నారు. 20 ఏళ్ల వయస్సు లోనే మావోయిస్టు ఉద్యమం బాటపట్టారు. అమె తమ్ముడు గోపి అలియాస్ ఆజాద్ కూడా 2006లో అక్క మార్గంలోనే ఉద్యమంలో చేరాడు. 2016లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆజాద్ మృతిచెందారు. అరుణక్క మావోయిస్టు పార్టీలో ఏఓబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలిగా ఉంటూ మహిళా విభాగాల్లో 30 ఏళ్లుగా కీలకంగా వ్యవహరించారు. మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి అలియాస్ చలపతి భార్య చనిపోవడంతో అరుణక్కను రెండో వివాహం చేసుకున్నారు. ఈ ఏడాది జనవరిలో ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చలపతి మరణించారు. భర్త మరణంతో అరుణ కుంగిపోలేదు. అనేక ఎన్‌కౌంటర్ల నుంచి ఆమె తప్పించుకున్నారు. పోలీసుల నిర్బంధం తీవ్రంగా ఉండడంతో ఇటీవల కాలంలో రంపచోడవరం అటవీ ప్రాంతాన్ని సేఫ్‌జోన్‌గా మార్చుకుని తలదాచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆమెకు ఆరుగురు మావోయిస్టులు భద్రత ఉన్నప్పటికీ ఎన్‌కౌంటర్‌లో బలయ్యారు. ఆమెకు భద్రతగా ఉన్న అంజూ కూడా మృతిచెందారు. ఇక అరుణక్కపై ఏపీలో రూ. 20 లక్షల రివార్డు ఉంది. 2018లో అరకు ఎమ్మెల్యే కిడారి శ్రావణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలను హత్య చేసిన ఘటనలో అరుణక్క పాల్గొన్నట్లు పోలీసులు కేసు నమోదుచేశారు. నా కుమార్తెను పోలీసులు కొద్ది రోజుల క్రితమే పట్టుకుని బంధించి ఇప్పుడు హతమార్చారు. దీన్ని ప్రభుత్వ హత్యగానే భావిస్తున్నాం. గతంలో నా కుమారుడు ఆజాద్‌ను బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారు. దీనిపై న్యాయపోరాటం చేస్తాం .- లక్ష్మణరావు, అరుణక్క తండ్రి

ఈ కబురు, వరంగల్/టేకుమట్ల: మావోయిస్టు అగ్రనేత, శాంతి చర్చల ప్రతినిధి గాజర్ల రవి అలియాస్ గణేష్, అలియాస్ ఉదయ్ మృతితో ఆయన స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) నుంచి అజ్ఞాతవాసంలోకి వెళ్లిన రవి.. దళ సభ్యుడిగా మొదలు పెట్టి కేంద్ర కమిటీ వరకు ఎదిగారు. విద్యార్థి దశనుంచే ఉద్యమాలపై ఆసక్తితో విప్లవాల బాట పట్టారు. 1985-86 సంవత్సరంలో వరంగల్‌లోని ఐటీఐలో చదువుతున్న క్రమంలోనే ఉద్యమాలకు ఆకర్షితుడై ఆర్ఎస్‌యూలో పనిచేశారు. తన అన్న గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ అప్పటికే ఉద్యమంలో క్రియాశీలకంగా ఉండటంతో ఆ ప్రభావం రవిపై పడింది. 1992లో పూర్తిస్థాయిలో ఉద్యమంలోకి వెళ్లారు. 1994-98 మధ్య ఏటూరునాగారం దళ సభ్యుడిగా, మహాదేవపూర్‌లో కమాండర్‌గా పని చేశారు. 1994లో లెంకలగడ్డలో మందుపాతర పేల్చి ఏడుగురు పోలీసులను చంపిన కేసులో నిందితుడిగా ఉన్నారు. 1998లో ఎన్‌టీఎస్‌జెడ్‌సీ సభ్యుడిగా నియమితుల య్యారు. 2000 సంవత్సరంలో ఖమ్మం - కరీంనగర్ - వరంగల్ (కేకే డబ్ల్యూ) కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2001లో ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌పై జరిగిన దాడిలో పాల్గొన్నట్టు సమాచారం ఉంది. 2002 సంవత్సరంలో మహాదేవపూర్ కమాండర్‌గా పనిచేస్తున్న స్వరూప అలియాస్ జిలానీ బేగంను వివాహం చేసుకోగా ఆమె ఏవోబీలోని రామగూడలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది. 2007లో ఆంధ్ర ఒడిశా బోర్డర్‌కు బదిలీ అయిన రవి.. అక్కడ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం కేంద్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతూనే ఆంధ్ర ఒరిస్సా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గాజర్ల రవి 2004లో శాంతి చర్చల ప్రతినిధిగా వ్యవహరించారు. కాల్పుల విరమణ, శాంతి చర్చల కు మేధావులు జరిపిన సంప్రదింపులకు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు చర్చల ప్రతినిధులుగా జనశక్తి పార్టీ నుంచి వెంకటేశ్ అలియాస్ రియాజ్, మావోయిస్టు పార్టీ నుంచి అక్కిరాజు హరగోపాల్ అలియాస్ ఆర్‌కే, గౌతమ్ అలియాస్ సుధాకర్‌లతో పాటు ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి హోదాలో గాజర్ల రవి కూడా పాల్గొన్నారు. శాంతి చర్చల ఎజెండాను తయారు చేయడంలో కీలక పాత్ర పోషించారు. రవి అన్న గాజర్ల సారయ్య అలియాస్ ఆజాద్ (మహారాష్ట్ర రాష్ట్ర కమిటీ సభ్యుడు) 2008 ఏప్రిల్ 2న ములుగు జిల్లా తాడ్వాయి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా, ఆయన తమ్ముడు గాజర్ల అశోక్ అలియాస్ ఐతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఉంటూ అనారోగ్యంతో జనజీవన స్రవంతిలో కలిసిపోయారు.రవి మృతిపై జిల్లా పోలీసులు బుధవారం మధ్యాహ్నం కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వెలిశాలకు తీసుకువచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నా సోదరుడి మరణంపై అనుమానాలున్నాయి. ఇప్పటివరకు మృతదేహాల ఫొటోలను విడుదల చేయలేదు. పోలీసులు మృతుల కుటుంబసభ్యులకు మధ్యాహ్నం వరకు సమాచారమివ్వలేదు. ఇది ఎన్‌కౌంటరో?.. పట్టుకుని కాల్చి చంపారో? ఏదైనా విష ప్రయోగం చేసి ఉండొచ్చు.





# ఓలా డ్రైవర్లకు జీరో కమీషన్



దేశవ్యాప్తంగా జీరో కమీషన్ మోడల్‌ను అమలు చేస్తున్నట్లు ఓలా క్యాబ్స్ తెలిపింది. 10 లక్షలకు పైగా డ్రైవర్ భాగస్వాములు తమ సంపాదనలో 100 శాతం ఆదా చేసుకోవచ్చని చెప్పింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా క్రియాశీలకంగా ఉన్న ఈ కార్యక్రమం ఆటోలు, బైకులు, క్యాబ్ డ్రైవర్లకు బిగ్ రిలీఫ్ అవుతుందని పేర్కొంది. రైడ్ పరిమాణం లేదా ఆదాయంపై ఎటువంటి పరిమితులను ఉండవని పేర్కొంది.

కొత్త ప్రోగ్రామ్‌లో భాగంగా డ్రైవర్లు ఈ ప్రణాళికను ఎంచుకోవచ్చని చెప్పింది. కమీషన్ రూపంలో ఓలాకు వెళ్లే ఛార్జీలను ఎటువంటి మినహాయింపులు లేకుండా డ్రైవర్లు ఆ మొత్తాన్ని పొందవచ్చు. అయితే అందుకు నెలవారీ సబ్‌స్క్రిప్షన్ పొందాలని కంపెనీ తెలిపింది. ఈ ఫీచర్ను ఉపయోగించుకునే డ్రైవర్లు 30 రోజుల పాటు రోజుకు రూ.67 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. అంటే నెలకు రూ.2,010 అవుతుంది.

ఈ ఫీచర్‌తో డ్రైవర్లు జీరో కమీషన్ క్లెయిమ్ చేసుకునే ఛార్జీలపై ఎలాంటి పరిమితులు లేవని, తమ ఛార్జీల మొత్తాన్ని క్లెయిమ్ చేసేటప్పుడు వాహనం ఎంపికపై కంపెనీ ఎలాంటి ఆంక్షలు విధించదని తెలిపింది. ఈ ఫీచర్ ఓలా ఆటో, ఓలా బైక్స్, ఓలా క్యాబ్స్‌కు అందుబాటులో ఉంది. 'కమీషన్లను తొలగించడం వల్ల డ్రైవర్ భాగస్వాములకు మరింత అవకాశాలు లభిస్తాయి' అని ఓలా ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మార్పు వల్ల డ్రైవర్ ఆదాయం ఏటా రూ.1,36,000 పెరుగుతుందని, ప్రస్తుత స్థాయిలతో పోలిస్తే ఇది 30 శాతం అధికమని చెప్పింది.



## జియో బ్లాక్‌రాక్ కొత్త ప్లాట్‌ఫామ్ 'అలాదీన్'

జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను మరింత సులభతరం చేసేందుకు 'అలాదీన్' ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించింది. దీంతో బ్లాక్‌రాక్‌కు చెందిన పెట్టుబడుల విశ్లేషణ, రిస్క్ నిర్వహణ ప్లాట్‌ఫామ్ మొదటిసారి భారత ఇన్వెస్టర్లకు అందుబాటులోకి వచ్చినట్టు సంస్థ ప్రకటించింది.

''పెట్టుబడులు ఇక ఎంతో సులభం. జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్ సంయుక్తంగా ఇదే నమ్మకాన్ని ఇన్వెస్టర్ల ముందుకు తీసుకొచ్చాయి. జియో డిజిటల్ ఫస్ట్ విధానానికి, బ్లాక్‌రాక్ సంస్థకు అంతర్జాతీయంగా పెట్టుబడుల్లో ఉన్న నైపుణ్యం కలగలసి ఇన్వెస్టర్లకు అనుకూలమైన సొల్యూషన్లను అందించనున్నాం''అని జియో బ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్ ఎక్స్ ప్లాట్‌ఫామ్‌పై ట్వీట్ చేసింది.

ఇది ఆరంభం మాత్రమేనంటూ.. అందరికీ అందుబాటు ధరలకే పెట్టుబడుల సేవలను అందించనున్నట్లు పేర్కొంది. జియో బ్లాక్ రాక్ అసెట్ మేనేజ్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ అనేది జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జెఎఫ్ఎస్ఎల్), యూఎస్ ఆధారిత బ్లాక్ రాక్ మధ్య 50:50 జాయింట్ వెంచర్.



## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం నష్టాల్లో ముగిశాయి. ఇంట్రాడేలో 81,237 వద్ద కనిష్టాన్ని తాకిన బీఎస్ఈ సెన్సెక్స్ 138.64 పాయింట్లు (0.17 శాతం) క్షీణించి 81,444.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 కూడా 41.35 పాయింట్లు లేదా 0.17 శాతం క్షీణించి 24,812.05 వద్ద ముగిసింది.**

విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.46 శాతం, 0.23 శాతం నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ మీడియా 1.27 శాతం నష్టపోగా, నిఫ్టీ ఐటీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ రియల్టీ, ఎనర్జీ, పీఎస్‌యూ బ్యాంక్, ఎఫ్ఎంసీజీ షేర్లు నష్టపోయాయి. మరోవైపు నిఫ్టీ కన్జ్యూమర్ డ్యూరబుల్స్, ఆటో, బ్యాంక్ లాభాల్లో ముగిశాయి.టీసీఎస్, అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్టీపీసీ షేర్లు 1.6 శాతం వరకు నష్టపోయాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్ టెల్ 4.4 శాతం వరకు లాభపడ్డాయి. మార్కెట్లలో ఒడిదుడుకులను అంచనా వేసే ఇండియా వీఐఎక్స్ 0.89 శాతం క్షీణించి 14.27 పాయింట్ల వద్ద స్థిరపడింది.

ఇజ్రాయెల్ఇరాన్ వివాదం తీవ్రతరం కావడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్లు ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో నాటాంజ్ వద్ద ఇరాన్ భూగర్భ యురేనియం కర్మాగారం దెబ్బతిన్నదన్న వార్తల నేపథ్యంలో ఇరు దేశాల మధ్య క్షిపణి దాడులు ఐదో రోజు కూడా కొనసాగాయి. దీనికి తోడు అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధాన నిర్ణయం, భవిష్యత్తులో రేట్ల కోత, ముడిచమురు ధరలు పెరగడం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు కలిగే నష్టాలపై చైర్మన్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యానం కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు.



## 9000 ఎంఏహెచ్ బ్యాటరీతో ₹14 వేలకే రెడ్‌మీ ప్యాడ్ 2

**రెడ్‌మీ నుంచి ప్యాడ్ 2 లాంచ్ అయ్యింది. దీని ధర రూ.14వేల నుంచి ప్రారంభం అవుతుంది.**

షావోమీకి చెందిన సబ్‌బ్రాండ్ రెడ్‌మీ దేశీయ మార్కెట్లోకి కొత్త ప్యాడ్‌ను విడుదల చేసింది. రెడ్‌మీ ప్యాడ్ 2 పేరిట దీన్ని లాంచ్ చేసింది. 9000 ఎంఏహెచ్ బ్యాటరీ, గూగుల్ సర్కిల్ టు సెర్చ్ వంటి ఫీచర్లతో ఈ ప్యాడ్ వస్తోంది. వైఫై ఓన్లీ, వైఫై+ సెల్యూలర్ మోడళ్లలో లభిస్తుంది. పూర్తి వివరాలు ఇవీ.. రెడ్‌మీ ప్యాడ్2 11 అంగుళాల 2.5k 10 బిట్ డిస్‌ప్లేతో 90Hz రిఫ్రెష్ రేటుతో వస్తోంది. 600 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉంది. వెట్ టచ్ టెక్నాలజీ సపోర్ట్ కూడా ఉంది. మీడియాటెక్ హీలియో జీ100 అల్ట్రా ప్రాసెసర్ అమర్చారు. ఆండ్రాయిడ్ 15 ఆధారిత హైపర్ ఓఎస్ 2.0తో పనిచేస్తుంది. వెనకవైపు 8 ఎంపీ కెమెరా ఉంది. ముందువైపు 5 ఎంపీ కెమెరా ఇచ్చారు. ఇందులోని క్వాడ్ స్పీకర్ సదుపాయం డాల్బీ అట్మాస్‌కు సపోర్ట్ చేస్తుంది. స్మార్ట్ పెన్, గూగుల్ సర్కిల్ టు సెర్చ్, జెమినీ ఏఐ వంటి ఫీచర్లు ఉన్నాయి.

ఇందులో అమర్చిన 9000 ఎంఏహెచ్ బ్యాటరీ 18W ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 4జీ, వైఫై, బ్లూటూత్, 3.5 ఎంఎం ఆడియో జాక్, యూఎస్‌బీ టైప్‌సి వంటివి ఉన్నాయి. ఈ ట్యాబ్ 510 గ్రాముల బరువు ఉంటుంది. ఇక ధర విషయానికొస్తే.. ఇది వైఫై, వైఫై+ సెల్యులర్ ఆప్షన్లలో లభిస్తుంది. వైఫై ఓన్లీ మోడల్ 4జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.13,999గా కంపెనీ నిర్ణయించింది. వైఫై+సెల్యులర్ మోడల్ 6జీబీ+128జీబీ వేరియంట్ రూ.15,999, 8జీబీ+256జీబీ వేరియంట్ ధర రూ.17,999గా నిర్ణయించింది. బ్లూ, గ్రే రంగుల్లో లభిస్తుంది. కంపెనీ అధికారిక ఈస్టోర్‌తో పాటు అమెజాన్, ఎంపిక చేసిన ఆఫ్‌లైన్ స్టోర్లలో జూన్ 24 నుంచి లభ్యమవుతుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డుపై రూ.వెయ్యి డిస్కౌంట్




# మారుతీ కార్లు కొనేవారికి ఊరట..

ఆటోమొబైల్స్ దిగ్గజం మారుతీ సుజుకీ తమ కస్టమర్లకు వాహన రుణాల సదుపాయాన్ని అందించేందుకు ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుతో చేతులు కలిపింది. కొత్త కార్లు, యూజ్డ్ కార్లు, వాణిజ్య వాహనాలకి రిటైల్ రుణాల కోసం ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని మారుతీ సుజుకీ తెలిపింది.

మరింత పెద్ద సంఖ్యలో కస్టమర్లకు చేరువయ్యేందుకు, ఆకర్షణీయమైన ఫైనాన్సింగ్ ఆఫర్లు అందించేందుకు ఇది తోడ్పడుతుందని మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు.

### మహీంద్రా చేతికి ఎస్ఎంఎల్ ఇసుజు

వాణిజ్య వాహన తయారీ కంపెనీ ఎస్ఎంఎల్ ఇసుజులో మెజారిటీ వాటా సొంతం చేసుకునేందుకు దేశీ ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా(ఎంఅండ్ఎం) అనుమతి పొందింది. ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) తాజాగా ఎక్స్‌లో పోస్ట్ ద్వారా వెల్లడించింది. ఎస్ఎంఎల్ ఇసుజులో 58.96 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు ఏప్రిల్‌లో ఎంఅండ్ఎం ప్రకటించింది.

ఇందుకు రూ. 555 కోట్లు వెచ్చించనున్నట్లు తెలియజేసింది. దీనిలో భాగంగా సంస్థలో సుమితోమో కార్పొరేషన్‌కున్న పూర్తి వాటా(43.96 శాతం)ను కొనుగోలు చేయనున్నట్లు ఏప్రిల్‌లో పేర్కొంది. అంతేకాకుండా పబ్లిక్ వాటాదారుగా ఉన్న ఇసుజు మోటార్స్ నుంచి 15 శాతం వాటా సొంతం చేసుకోనున్నట్లు వివరించింది.



# నాగచైతన్యతో కలిసి ప్రమోషన్స్.. సమంత క్లారిటీ

**నాగచైతన్య , సమంత కలిసి వర్క్ చేసిన చిత్రం 'ఏమాయ చేసావె' . ఈ సినిమా రీ రిలీజ్ ప్రమోషన్స్‌ను ఉద్దేశించి సమంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.**

నటుడు నాగచైతన్య , నటి సమంత కలిసి వర్క్ చేసిన చిత్రం 'ఏ మాయ చేసావె' . సుమారు 15 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం వచ్చే నెల 18న రీ రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలోనే 'ఏ మాయ చేసావె' రీ రిలీజ్ ప్రమోషన్స్‌లో సామ్‌చై కలిసి పాల్గొననున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఆయా వార్తలపై సమంత స్పందించారు. అందులో ఎలాంటి నిజం లేదని ఆంగ్ల వెబ్‌సైట్‌తో ఆమె చెప్పారు. ఇలాంటి వార్తలు ఎక్కడి నుంచి పుట్టుకొస్తున్నాయో తనకు తెలియడం లేదన్నారు. ''చిత్రబృందానికి సంబంధించిన వ్యక్తులతో కలిసి నేను ఆ సినిమా ప్రమోట్ చేయడం లేదు. నిజం చెప్పాలంటే ప్రమోషన్స్‌కు దూరంగా ఉంటున్నా. ఇలాంటి వార్తలు ఎవరు కల్పిస్తున్నారో నాకు తెలియడం లేదు. ఆ సినిమాకు ఉన్న అభిమానులు నటీనటులు కలిసి ప్రమోట్ చేస్తే చూడాలనుకుని ఉండొచ్చు. ఏది ఏమైనా ప్రేక్షకుల దృష్టికోణంపై ఒకరి జీవితం ఆధారపడి ఉండదు'' అని ఆమె చెప్పారు.

అనంతరం షూటింగ్ రోజులను గుర్తు చేసుకున్నారు. ''నిజం చెప్పాలంటే నేను షూటింగ్‌లో పాల్గొన్న తొలి చిత్రం 'మాస్కోవెన్ కావేరి'. అందులో నా స్నేహితుడు రాహుల్ రవీంద్రన్ హీరోగా నటించాడు. ఆ సినిమాకు సంబంధించిన విషయాలు నాకు పెద్దగా గుర్తు లేవు. ఎందుకంటే తొలిరోజు షూట్ అయిన వెంటనే చాలా రోజులపాటు విరామం ఇచ్చారు. ఆ తర్వాత మళ్లీ ఎప్పుడో మొదలుపెట్టారు. దానివల్ల సినిమా విశేషాలు పెద్దగా గుర్తులేవు. నా రెండో చిత్రం 'ఏ మాయ చేసావె'కు సంబంధించిన అన్ని విషయాలు నాకు గుర్తున్నాయి. జెస్సీకార్తిక్‌లపై చిత్రీకరించిన ఇంటి గేటు సీన్ నా తొలి షాట్. కెరీర్ ఆరంభంలోనే దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మేనన్‌తో కలిసి వర్క్ చేసినందుకు ఎంతో సంతోషంగా అనిపించింది'' అని ఆమె తెలిపారు. సమంత ప్రస్తుతం నటిగానే కాకుండా నిర్మాతగానూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఆమె నిర్మాతగా చేసిన తొలి ఫీచర్ ఫిల్మ్ 'శుభం' ఇటీవల విడుదలై వినోదాన్ని పంచింది.




# కంటతడి పెట్టించేలా 'పాపా'

కవిన్, అపర్ణాదాస్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డాడా'. గణేశ్ కె.బాబు దర్శకత్వం వహించిన ఈ చిత్రం తమిళంలో రూ. 40 కోట్లు వసూలు చేసింది. ఎన్నారై శ్రీమతి నీరజ కోట ఈ చిత్రాన్ని 'పాపా' పేరుతో తెలుగులో విడుదల చేశారు. ఈ చిత్రం కథ విషయానికొస్తే.. పెళ్ళికి ముందే హద్దులు దాటిన ఒక జంట జీవితంలో చోటు చేసుకున్న విచిత్ర మలుపుల సమహారమే ఈ చిత్రం.

మణి (కవిన్), సింధు (అపర్ణ దాస్) ఇద్దరు ప్రేమించుకుంటారు. కాలేజీ టైంలోనే సింధు గర్భం దాల్చుతుంది. ఈ విషయం ఇద్దరి కుటుంబాలలో తెలిసి.. ఇద్దరిని బయటకు వెళ్లగొడతారు. బయటకు వచ్చి ఇద్దరు కలిసి కొత్త జీవితాన్ని ప్రారంభిస్తారు. ఒకవైపు చదువుతూనే వైవాహిక జీవితాన్ని ఎలా కొనసాగించారు? ఈ క్రమంలో వారిద్దరికి ఎదురైన సమస్యలు ఏంటి? చివరి వరకు ఈ జంట కలిసే ఉందా లేదా అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. వయసులో ఉండే ఆకర్షణలు, ఆవేశాలు, అపార్థాలు, తరాల మధ్య అంతరాలు, వ్యక్తుల మధ్య ఉండే ఇగోలు, ఫ్రెండ్ షిప్, హెల్పింగ్ నేచర్, ముఖ్యంగా బంధాలు, భావోద్వేగాల కలబోతగా "పాపా" చిత్రాన్ని దర్శకుడు గణేష్ బాబు ఎంతో హృద్యంగా తెరకెక్కించాడు. కథగా చెప్పుకోవడానికి సింపుల్ గా ఉన్నా... కథనాన్ని రక్తి కటించిన తీరుకు ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. భాగ్యరాజా, విటివి గణేష్ తప్ప మిగతా పాత్రలు పోషించినవారు మనకు తెలియనివారే అయినప్పటికీ... ప్రేక్షకులు ఆయా పాత్రలతో ప్రయాణం చేస్తారు. ముఖ్యంగా క్లైమాక్స్ లో కంట తడి పెట్టని వారంటూ ఎవరూ ఉండరు. హృదయాల్ని మెలిపెట్టేసే పతాక సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. . హీరోయిన్ అపర్ణాదాస్... కెరీర్ బిగినింగ్ నాటి నయనతారను కాస్త పోలి ఉండడం వల్ల... అట్లీ దర్శకత్వంలో ఆర్య నయనతార నటించగా ఘన విజయం సాధించిన "రాజా రాణి" చిత్రం గుర్తుకు వస్తుంది. అయితే ఆ పోలిక జోనర్ కు మాత్రమే పరిమితం.హీరోగా నటించిన కవిన్, హీరోయిన్ పాత్ర పోషించిన అపర్ణాదాస్ ప్రేక్షకుల్ని కట్టి పడేస్తారు. వీళ్ళ అబ్బాయిగా చేసిన మాస్టర్ ఇయాన్ తోనూ మనం ప్రేమలో పడిపోతాం. ముఖ్యంగా క్లైమాక్స్ లో కంట తడి పెట్టని వారంటూ ఎవరూ ఉండరు. హృదయాల్ని మెలిపెట్టేసే పతాక సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ.

హీరోయిన్ అపర్ణాదాస్... కెరీర్ బిగినింగ్ నాటి నయనతారను కాస్త పోలి ఉండడం వల్ల... అట్లీ దర్శకత్వంలో ఆర్య నయనతార నటించగా ఘన విజయం సాధించిన "రాజా రాణి" చిత్రం గుర్తుకు వస్తుంది. అయితే ఆ పోలిక జోనర్ కు మాత్రమే పరిమితం. ఎడిటింగ్ పరంగా ఇంకొంచెం క్రిస్ప్‌గా ఉంటే మరింత బాగుండేదనిపిస్తుంది. అలాగే సెకండాఫ్ లో హీరోహీరోయిన్ల మధ్య కాన్ఫ్లిక్ట్ ను ఇంకొంచెం క్యాష్ చేసుకునెలా రెండుమూడు సీన్స్ కన్సీవ్ చేసుకుని ఉంటే ఎమోషన్ మరింత పండేదనిపిస్తుంది "సింగిల్ పేరెంటింగ్"లో ఉండే పెయిన్, తండ్రీకొడుకుల మధ్య బాండింగ్ కు ఇంకొంచెం ప్రాధాన్యత ఇచ్చి ఉంటే కూడా ఇంకా బాగుండేదనిపిస్తుంది. అయితే... మనసు తడిని వెలికి తీసే క్లైమాక్స్... ఇటువంటి చిన్న చిన్న కంప్లైంట్స్ కు తావు లేకుండా చేస్తుంది.

## 'టామ్ అండ్ జెర్రీ' చూసి యాక్షన్ సీక్వెన్స్‌లు..


# అక్షయ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు

కార్టున్ షో చూసి స్టంట్ సన్నివేశాలు రూపొందించినట్లు అక్షయ్ తెలిపారు.

తెరపై సాహసాలు చేయడంలో ఎప్పుడూ ముందుంటారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అక్షయ్ కుమార్ . తాజాగా ఆయన స్టంట్స్‌కు ప్రేరణ టామ్ అండ్ జెర్రీ షో అని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. తన చిత్రాలు 'హాలిడే', 'ఖిలాడి' సిరీస్ వంటి చిత్రాల్లోని యాక్షన్ సన్నివేశాలు ఆ కార్టున్ షో చూసే రూపొందించినట్లు తెలిపారు.

'ఖిలాడి' సినిమాలోని విమాన సన్నివేశం టామ్‌క్రూజ్ నటించిన మిషన్ ఇంపాసిబుల్: ద ఫైనల్ రెకనింగ్‌లోని సీన్స్‌ను పోలుస్తూ కొందరు పోస్ట్‌లు పెట్టడంతో ఈ స్టంట్స్ గురించి అక్షయ్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. తాను టామ్ అండ్ జెర్రీ చూసి వాటిని రూపొందించినట్లు తెలిపారు. "మీకు ఈ విషయం చెబితే ఆశ్చర్యపోతారు. చాలామంది నమ్మరు. కానీ, నేను ఆ కార్టూన్ షో చూశాకే అలాంటి విన్యాసాలు చేయాలని ఐడియా వచ్చింది. ఆ షో చాలా నవ్వులు పూయిస్తుంది. టామ్, జెర్రీ మధ్య ఎన్నో యాక్షన్ సన్నివేశాలు కూడా ఉంటాయి. నేను వాటిని గమనించి ఉపయోగించాను" అని చెప్పారు. అలాగే ఆ షో చాలా హింసాత్మకంగా కూడా ఉంటుందని చమత్కరించారు.

అక్షయ్ నటించిన 'హౌస్‌ఫుల్ 5' ఇటీవల విడుదలై ఆదరణ సొంతం చేసుకుంది. అక్షయ్ కుమార్, అభిషేక్ బచ్చన్, రితేశ్ దేశ్‌ముఖ్, జాక్వలైన్ ఫెర్నాండేజ్, సోనమ్ బజ్వా, నర్గీస్ ఫక్రీ, సంజయ్ దత్, జాకీ ష్రాఫ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన 'హౌస్‌ఫుల్' ఫ్రాంచైజీలో భాగంగా వచ్చిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్‌లలో నవ్వులు పూయిస్తోంది.





# పూరి చిత్రంలో సంయుక్త

సంయుక్తా మేనన్ తెలుగు, హిందీ, తమిళం అని తేడాల్లేకుండా అన్ని భాషల్ని చుట్టేస్తోంది. వరుస సినిమాలతో జోరు చూపిస్తోంది. అయితే ఇప్పుడామె ఖాతాలో మరో పాన్ ఇండియా సినిమా చేరింది.

సంయుక్తా తెలుగు, హిందీ, తమిళం అని తేడాల్లేకుండా అన్ని భాషల్ని చుట్టేస్తోంది. వరుస సినిమాలతో జోరు చూపిస్తోంది. అయితే ఇప్పుడామె ఖాతాలో మరో పాన్ ఇండియా సినిమా చేరింది. తమిళ కథానాయకుడు విజయ్ సేతుపతి .. దర్శకుడు పూరి జగన్నాథ్ కలయికలో ఓ బహుభాషా చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. దీన్ని పూరి కనెక్ట్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. సీనియర్ నటి టబు ఓ ప్రధాన పాత్రధారిగా కనిపించనుంది. ఇప్పడీ బృందంలోకి సంయుక్తా కూడా చేరింది. ఆమె ఈ సినిమాలో కీలక పాత్ర పోషించనున్నట్లు తెలియజేస్తూ చిత్ర వర్గాలు మంగళవారం సామాజిక మాధ్యమాల వేదికగా ఓ ప్రకటనని విడుదల చేశాయి.

"ఆమె నడకలో హుందాతనం.. కళ్లలో ఆగ్రహం" అంటూ తన ఫొటోను పంచుకున్నాయి. ఇదొక పూర్తి స్థాయి మాస్, కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబు కానుంది. విజయ్ ఇందులో మునుపెన్నడూ చేయని విభిన్న పాత్రలో.. సరికొత్త లుక్‌తో కనిపించనున్నారు. త్వరలో చిత్రీకరణ మొదలు కానున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి 'భిక్షాందేహి' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక సంయుక్త ప్రస్తుతం తెలుగులో 'అఖండ 2: తాండవం', 'స్వయం భూ' చిత్రాల్లో నటిస్తోంది. తమిళంలో లారెన్స్‌తో 'బెంజ్'లో సందడి చేయనుంది. హిందీ, మలయాళంలో ఒక్కో సినిమా చేస్తోంది.



# హీరో ఆర్య నివాసంలో ఐటీ సోదాలు

కోలీవుడ్ నటుడు ఆర్య నివాసం, ఆయనకు చెందిన రెస్టరంట్లలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.

కోలీవుడ్ నటుడు ఆర్య నివాసంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు బుధవారం సోదాలు నిర్వహిస్తున్నారు. అన్నానగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆయనకు చెందిన సీ షెల్ రెస్టరంట్లపై కూడా అధికారులు దాడులు చేస్తున్నారు. పన్ను ఎగవేత ఆరోపణల నేపథ్యంలోనే అధికారులు ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, ఈ దాడులను ఉద్దేశించి ఆర్య స్పందించారు. సీ షెల్ రెస్టరంట్లతో తనకు సంబంధం లేదని ఆయన స్థానిక మీడియాతో చెప్పారు. ఈ హోటళ్ల నిర్వహణ బాధ్యతను ఆయన కొన్నేళ్లక్రితమే మరో వ్యక్తికి అప్పగించినట్లు తెలుస్తోంది.




## నాలుగో స్థానంలో శుభ్‌మన్ గిల్.. మీరు సమర్థిస్తారా?

ఇంగ్లాండ్‌తో జరగనున్న తొలి టెస్టులో శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో బరిలోకి దిగడాన్ని మీరు సమర్థిస్తారా?మీ అభిప్రాయం దిగువ పోల్‌లో తెలియజేయండి.

జూన్ 20 నుంచి ఇంగ్లాండ్‌తో ప్రారంభంకానున్న తొలి టెస్టులో టీమ్‌ఇండియా తరపున నాలుగో స్థానంలో బ్యాటింగ్ దిగేది ఎవరో తేలిపోయింది. విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో టీమ్‌ఇండియా టెస్టు జట్టులో నాలుగో స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఇక, కొత్తగా టెస్టు కెప్టెన్‌గా నియమితుడైన శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగనున్నాడు. మరి గిల్ ఈ ప్లేస్‌లో రావడాన్ని మీరు సమర్థిస్తారా? మీ అభిప్రాయం దిగువ పోల్‌లో తెలియజేయండి.

# ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌లో భారత ఓపెనర్లు, పేసర్లు.. పాఠకుల ఓటు ఎవరికంటే?

ఇంగ్లాండ్‌తో జరగనున్న టెస్టు సిరీస్‌లో టీమ్‌ఇండియా ఓపెనర్లుగా ఎవరుండాలి, తుది జట్టులో పేసర్లు ఎవరుంటే బాగుంటుంది అనే అంశాలపై పోల్ నిర్వహించగా పాఠకుల నుంచి మంచి ఆదరణ లభించింది.

ఇంగ్లాండ్‌తో టీమ్‌ఇండియా ఐదు టెస్టుల సిరీస్ ఆడనున్న విషయం తెలిసిందే. ఈనెల 20న లీడ్స్ వేదికగా తొలి టెస్ట్ మొదలవుతుంది. ఈ సిరీస్‌లో టీమ్‌ఇండియా ఓపెనర్లుగా ఎవరుంటే బాగుంటుంది, తుది జట్టులో ఏ పేసర్లు ఉండాలి అనే అంశాలపై పోల్స్ నిర్వహించాం. వీటికి పాఠకుల నుంచి మంచి ఆదరణ వచ్చింది. ఓపెనర్ల పోల్ విషయానికొస్తే.. యశస్వి జైస్వాల్, సాయి సుదర్శన్ జోడీ ఓపెనింగ్ చేయాలని అత్యధిక శాతం మంది పాఠకులు ఓట్లు వేశారు. కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ జోడీ తర్వాతి స్థానంలో నిలిచింది.

**ఓపెనర్లుగా ఎవరు? ఓవరాల్‌గా వచ్చిన ఓట్లు**


యశస్వి జైస్వాల్ (81.4 శాతం)
సాయి సుదర్శన్ (46.8 శాతం)
కేఎల్ రాహుల్ (35.8 శాతం)
శుభ్‌మన్ గిల్ (28.3 శాతం)
అభిమన్యు ఈశ్వరన్ (7.8 శాతం)

**టీమ్‌ఇండియా 'పేస్ గుర్రాలు' ఎవరు? వచ్చిన ఓట్లు**

జస్‌ప్రీత్ బుమ్రా (99 శాతం)
మహ్మద్ సిరాజ్ (86.6 శాతం)
అర్‌షదీప్ సింగ్ (76.1 శాతం)
ప్రసిద్ధ్ కృష్ణ (65.6 శాతం)
శార్దూల్ ఠాకూర్ (54.4 శాతం)
ఆకాశ్ దీప్ (18.3 శాతం)







# ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్‌ను క్షమాపణ కోరిన రన్నరప్ సబలెంకా

**ఫైనల్ అనంతర వ్యాఖ్యలపై లేఖ**

**బెర్లిన్:** తాజా ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ కోకో గాఫ్‌కు ప్రపంచ నంబర్‌వన్ ప్లేయర్ సబలెంకా (బెలారస్) క్షమాపణలు చెప్పింది. ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ కోసం ఇద్దరు తలపడగా... అమెరికన్ స్టార్ కోకో గాఫ్ విజేతగా నిలిచింది. మ్యాచ్ అనంతరం రన్నరప్ సబలెంకా మాట్లాడుతూ... తన స్వీయ తప్పిదాల వల్లే ప్రత్యర్థి గెలిచిందని, విజయంలో గాఫ్ పాత్రలేదన్నట్లుగా వ్యాఖ్యానించింది. మూడు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత అయిన సబలెంకా వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెలువెత్తాయి. దీంతో క్షమాపణలు కోరుతూ సబలెంకా లేఖ రాసింది.

'నా వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేస్తున్నాను. ఓ విజేతను ఉద్దేశించి అలా మాట్లాడాల్సింది కాదు. నా భావోద్వేగాలను నియంత్రించుకుని ఉంటే బాగుండేది. గాఫ్‌ను క్షమాపణలు కోరుతున్నాను. మనుషులందరూ పొరపాట్లు చేస్తుంటారు. జీవితంలో నేర్చుకునే దశలో ఉన్న నేను కూడా అంతే. తదనంతరం నేను మాట్లాడిన మాటలు నన్నే కలత పెట్టాయి. ముమ్మాటికి ఫ్రెంచ్ ఓపెన్ గెలిచే అర్హత గాఫ్‌కే ఉంది. ఆమె విజయాన్ని నేను మనస్ఫూర్తిగా గౌరవిస్తున్నా' అని లేఖలో పేర్కొంది.

నిజానికి గాఫ్‌పై మాటలతో దాడి చేయాలనే ఉద్దేశం తనకు లేదని చెప్పింది. మ్యాచ్ ముగిసిన వెంటనే మీడియా సమావేశం జరగడం... ఫలితంతో నిరాశలో ఉన్న తాను అలా మాట్లాడాల్సి వ చ్చిందని వివరణ ఇచ్చింది. 'ఎప్పుడైనా సరై ప్రత్యర్థిని గౌరవించే నాకు ఇలా చిన్నబుచ్చే వ్యాఖ్యలు చేయడం పట్ల మనస్తాపం చెందాను. అందుకే మన్నించమని విజ్ఞప్తి చేస్తున్నాను. జీవితంలో నేను ఎప్పటికి గుర్తుంచుకోవాల్సిన పాఠం ఇది' అని సబలెంకా తెలిపింది.

బెలారస్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా రెండు ఆస్ట్రేలియన్ ఓపెన్ (2023, 2024) టైటిల్స్‌తో పాటు ఒక యూఎస్ ఓపెన్ (2024) ట్రోఫీ గెలుచుకుంది. అయితే ప్రపంచ రెండో ర్యాంకర్ కోకో గాఫ్‌తో జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో తడబడింది. ఏకంగా 70 అనవసర తప్పిదాలు చేసింది. గాఫ్ మాత్రం 30 తప్పిదాలే చేసి టైటిల్ విజేతగా నిలిచింది. కోకో గాఫ్ 2023లో సబలెంకాపైనే గెలిచి యూఎస్ ఓపెన్ టైటిల్ కూడా సాధించింది.

# ఆసియా కప్ ఫుట్‌బాల్ క్వాలిఫయర్స్ టోర్నీకి సౌమ్య

**న్యూఢిల్లీ:** ఆసియా కప్-2026 మహిళల ఫుట్‌బాల్ క్వాలిఫయర్స్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 24 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో తెలంగాణకు చెందిన సౌమ్య గుగులోత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంది. దేశవాళీ లీగ్‌లో ఈస్ట్ బెంగాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సౌమ్య గత సీజన్‌లో భారత మహిళల ఉత్తమ ఫుట్‌బాలర్ అవార్డును అందుకుంది. ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా భారత జట్టు గ్రూప్ 'బి'లో ఉంది. భారత జట్టుతోపాటు గ్రూప్ 'బి'లో థాయ్‌లాండ్, మంగోలియా, తిమోర్ లెస్టె, ఇరాక్ జట్లున్నాయి. ఈనెల 23 నుంచి జూలై 5 వరకు జరిగే గ్రూప్ 'బి' మ్యాచ్‌లకు బ్యాంకాక్ ఆతిథ్యమిస్తుంది. ఈనెల 23న తమ తొలి మ్యాచ్‌లో మంగోలియాతో ఆడనున్న భారత జట్టు ఆ తర్వాత వరుసగా తిమోర్ లెస్టె (జూన్ 29న), ఇరాక్ (జూలై 2న), థాయ్‌లాండ్ (జూలై 5న) జట్లతో పోటీపడుతుంది. 2026 ఆసియా కప్ మహిళల ఫుట్‌బాల్ టోర్నీకి మార్చి 1 నుంచి 21 వరకు ఆస్ట్రేలియా ఆతిథ్యమిస్తుంది. మొత్తం 12 దేశాలు బరిలోకి దిగుతాయి. ఆతిథ్య దేశం హోదాలో ఆస్ట్రేలియా, 2022 టోర్నీ చాంపియన్ చైనా, 2022 టోర్నీ రన్నరప్ దక్షిణ కొరియా, 2022 టోర్నీలో మూడో స్థానం పొందిన జపాన్ జట్లు ఇప్పటికే నేరుగా అర్హత సాధించాయి. మిగిలిన ఎనిమిది బెర్త్‌లు క్వాలిఫయర్స్ టోర్నీ ద్వారా ఖరారవుతాయి. క్వాలిఫయర్స్ టోర్నీలో మొత్తం 34 జట్లు పాల్గొంటున్నాయి. 34 జట్లను ఎనిమిది గ్రూప్‌లుగా విభజించారు. 'ఎ', 'బి' గ్రూపుల్లో 5 జట్ల చొప్పున... మిగిలిన 'సి', 'డి', 'ఈ', 'ఎఫ్', 'జి', 'హెచ్' గ్రూపుల్లో 4 జట్ల చొప్పున ఉన్నాయి. ఎనిమిది గ్రూప్‌ల విజేత జట్లు వచ్చే ఏడాది ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధిస్తాయి.

భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు: ఎలాంగ్‌బమ్ పంథోయ్ చాను, మోనాలీసా దేవి, పాయల్ బసుదె (గోల్‌కీపర్లు), హేమం షిల్కీ దేవి, కిరణ్ పిస్దా, మార్టినా థోక్‌చోమ్, స్వీటీ దేవి, నిర్మలా దేవి, పూర్ణిమ కుమారి, సంజు, రంజన చాను (డిఫెండర్లు), అంజు తమాంగ్, గ్రేస్ డాంగ్మె, కార్తీక అంగముత్తు, రత్నబాలా దేవి, ప్రియదర్శిని సెల్లాదురై, సంగీత బస్ఫోరె (మిడ్ ఫీల్డర్లు), లిండా కోమ్ సెర్టో, మాళవిక, మనీషా కల్యాణ్, మనీషా నాయక్, ప్యారీ జక్సా, రింపా హల్దర్, సౌమ్య గుగులోత్ (ఫార్వర్డ్స్).







# ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు.. కోహ్లీ స్థానాన్ని భర్తీ చేసేదెవరో చెప్పిన పంత్

జూన్ 20 నుంచి ఇంగ్లాండ్‌తో ప్రారంభంకానున్న తొలి టెస్టులో టీమ్‌ఇండియా తరపున నాలుగో స్థానంలో బ్యాటింగ్ దిగేది ఎవరో తేలిపోయింది.

జూన్ 20 నుంచి ఇంగ్లాండ్‌తో ప్రారంభంకానున్న తొలి టెస్టులో టీమ్‌ఇండియా తరపున నాలుగో స్థానంలో బ్యాటింగ్ దిగేది ఎవరో తేలిపోయింది. విరాట్ కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో టీమ్‌ఇండియా టెస్టు జట్టులో నాలుగో స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఆ స్థానాన్ని ఎవరు భర్తీ చేస్తారనే ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ విషయంపై వైస్ కెప్టెన్ రిషభ్ పంత్ క్లారిటీ ఇచ్చాడు. కొత్తగా టెస్టు కెప్టెన్‌గా నియమితుడైన శుభ్‌మన్ గిల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగనున్నాడు. సిరీస్ ప్రారంభానికి ముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో పంత్ ఈ విషయాన్ని తెలియజేశాడు. తాను ఐదో స్థానంలో బరిలోకి దిగుతానని పంత్ తెలిపాడు.

'మూడో స్థానంలో ఎవరు ఆడతారనే దానిపై ఇంకా చర్చలు జరుగుతున్నాయి. కానీ, నాలుగు, ఐదు స్థానాల్లో ఎవరు ఆడతారనే దానిపై స్పష్టత వచ్చింది. శుభ్‌మన్ గిల్ 4లో బ్యాటింగ్ చేస్తాడని భావిస్తున్నా. నేను ప్రస్తుతం ఐదో స్థానంలో ఆడతా. మిగిలిన వారు ఏ ఏ స్థానాల్లో ఆడతారనే అంశంపై చర్చలు జరుగుతున్నాయి' అని పంత్ పేర్కొన్నాడు. కోహ్లీ స్థానంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఆడాలని, ఆ స్థానానికి ఇప్పుడు గిల్ చక్కగా సరిపోతాడని మాజీ కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడిన సంగతి తెలిసిందే. ఇంగ్లాండ్‌తో తొలి టెస్టుకే కాకుండా మిగిలిన మ్యాచ్‌ల్లోనూ గిల్, పంత్ నాలుగు, ఐదు స్థానాల్లో ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.